శుభమస్తు ఓం అవిఘ్నమస్తు

# "గీతా వచనము"

## శ్రీమత్ భగవద్గీత

## స్వేచ్ఛా వ్యాఖ్యానం

### తెలుగు వచన రచన



**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.



## ముందు మాట

శ్రీమత్ భగవద్గీతను సాక్షాత్తూ భగవద్దత్తమైన బోధగా స్వీకరించి, కొన్ని వేల సంవత్సరాల నుండి ఎందరో భక్తులు కృతార్థులయ్యారు, అవుతున్నారు, ఇకముందు అవుతారు. ఇది ఒక గ్రంథం కాదు, కావ్యంకాదు, పురాణం కాదు, ఆఖరికి ఒక అద్భుతమైన కథ కూడా కాదు. మరి దీనికెందుకింత ప్రాశస్త్యం? ప్రతి న్యాయస్థానం (భారతదేశంలో) భగవద్గీతపై ప్రమాణం చేయిస్తారు? దీనిగొప్ప తనమేమిటి?

2001 లో భగవద్గీత పద్యరూపంలో వ్రాద్దామని ఒక ఆలోచన వచ్చింది. అయితే నాకు సంస్కృతం రాదు. తత్త్వ జ్ఞానం లేదు. ఆధ్యాత్మిక చింతన లేదు. పురాణాలు తెలుసుకొని పెద్దగా చదవలేదు. 53 ఏళ్ళు ఒక సామాన్య మానవునిగా (వృత్తి ఇంజినీరు ప్రవృత్తి ఏదైనా సాధించడం) సంసార సుఖమే ధ్యేయంగా, పిల్లల్ని పెద్ద చదువులు చదివించడం లక్ష్యంగా, డబ్బు సంపాదించడం వ్యసనంగా గడిపిన మనిషికి అసలు భగవద్గీత అనువదించే హక్కు కానీ శక్తికానీ ఉంటుందా?



ఇది మొదటి సందేహం. సంస్కృతం రానివాడు కేవలం పద్యాలు వ్రాయడం హాబీగా ఉన్నవాడు వ్రాయగలడా? ఇది రెండవ సందేహం. వ్రాసి ఏం సాధించాలి? ఇది మూడవ సందేహం. ఇలా ఒక వంద సందేహాలున్నాయి.

సందేహాలుండేవాడు, నిత్య శంకితుడు ఏమీ సాధించలేడు. కనుక భగవద్గీత టీక తాత్పర్యం ఉన్న పుస్తకాలు తీసుకుని చదవడం ప్రారంభించాను. ఎన్నో పుస్తకాలు చదువుతూ కాల వ్యాపన చేయడం కూడా ఇష్టం లేదు.

కేవలం నాలుగు పుస్తకాలని మాత్రం ఎంచుకుని నా పని మొదలుపెట్టాను. అయితే ఇక్కడ ఒక పెద్ద సమస్య మొదలయింది.

సంస్కృతంలో ఒక అక్షరంతో వాక్యం అర్థం అంతా మారిపోతుంది. ఒక అక్షరానికి, పదానికి ఎన్నో అర్థాలున్నాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా అర్థం చేసుకుని వారికి తోచినట్లు దాని అర్థం చెప్పసాగారు.



ఇకపోతే భగవద్గీతకు అర్థం భాష్యం చెప్పిన శంకరాచార్యుల వారు, రామానుజులు, రాఘవేంద్రులు ఇత్యాది మహా యోగులు, గురువులు వాళ్ళ మతాన్ని బట్టి (ద్వైతమూ, అద్వైతమూ... మొ॥) ఆత్మని పరమాత్మగా తలచి ఒకరు, వేరుగా తలచి ఒకరు, ఆత్మని భక్తుడైన అర్జునునిగా తలచి ఒకరు, ఇలా ఎవరి అర్థం వారు చెప్పారు. రాజాజీవంటి ఆధునిక జ్ఞానులు తార్కికంగా చెప్పారు. ఇవి అన్నీ సరియైనవేనా? ఎలా అవుతాయి? శివుడన్నా, విష్ణువన్నా, అల్లా అన్నా యెహోవా అన్నా ఎవరైనా దేవుడే అంటే పరమాత్మే. నీవెలా ఊహిస్తే అలా అదే పరమాత్మను పూజించినట్లే. మరి వేరు వేరు అర్థాలు ఎలా ఉన్నా వాటి సారం ఒకటే. భగవంతుడే అన్నిటికీ మూలం, భర్త, అతీతుడు, సృష్టి స్థితి లయ కారకుడు, ఆది మధ్యాంత రహితుడు భావాతీతుడు, గుణాతీతుడు, నిర్వికార నిరంజనుడూ ఇలా వ్రాసుకుంటూ పోతే పేజీలు పేజీలు వ్రాయవచ్చు.

ఇది సరే మరి నేను ఏ అర్థం వ్రాయాలి? నేను ఒకటే ఆలోచించాను. సంగీతానికి భాషలేదు కానీ, గీతానికి భాష

వుంది. ఆనందించడానికి భాష అక్కరలేదు. కానీ అర్థం చేసుకోవడానికి భాష కావాలి. భాష తెలుగే అయినా అర్థం చెప్పేవాని భాషా జ్ఞానాన్ని బట్టి అది చదివే వాణ్ణి తికమకలు పెట్టొచ్చు.

అయితే దీని తర్వాత ఏమిటి? అసలు భగవద్గీత ఏం చెపుతోంది? ఈ పద్యాలు కూడా చదివి అర్థం చేసుకోలేని వాడికి మరి మోక్షం లేదా? ఇది ఆలోచించి గీతా సారాన్ని విపులంగా వ్రాద్దామని ఆలోచించాను. ఒక శ్లోకం అర్థం తర్వాత ఇంకొక శ్లోకం యొక్క అర్థం వ్రాసుకుంటూ పోతే చాలు అని నాకనిపించలేదు. అలా చేసిన ఒక పుస్తకంలోని వాక్యం వ్రాస్తాను చూడండి.

**“ఏది తెలియదగినదో, అది సర్వేంద్రియముల గుణముల తెలియచేయునదియును వాస్తవమున ఇంద్రియములు లేనిదియు, మరియు ఆసక్తి రహితమును సకలము భరించునదియై యున్నది నిర్గుణంబయ్యును గుణములనుభవించునది”**



(15వ శ్లోకం 13వ అధ్యాయం)

ఈ వాక్యం ఎంతమంది కర్థం అవుతుంది. భగవద్గీతను హిందీలో ఒక మహావ్యక్తి అనువదిస్తే దానిని ఇంకొకరు హిందీవచ్చిన పండితులు తెలుగులోకి అనువదిస్తే ఇట్లా అర్థం వచ్చింది. ఇట్లాగే అర్థాలు వరుసగా వ్రాసుకుంటూ పోతే లాభమేమిటి? ఎలా అర్థం అవుతుంది? సామాన్యుడికి భగవంతుడు ఏం చెప్పాడో ఎలా తెలుస్తుంది?

అందుకని నేను కేవలం అనువాదం కాకుండా నాకు అర్థమయిన రీతిలో అతి సంక్షిప్తంగా, అర్థవంతంగా ఆలోచన కలిగించే విధంగా వ్రాద్దామని నిశ్చయించుకున్నాను.

ఈ నా ప్రయత్నం నా ఆత్మతృప్తికే. ఇంకొకళ్ళని ఉద్ధరించడానికి కాదు. మనకంటే కొన్ని కోట్ల రెట్లు గొప్ప వ్యక్తులు దీన్ని (భగవద్గీతను) చదివి మథించి అర్థాలు, భాష్యాలు, సారాంశాలు వ్రాశారని మరొక్కసారి గుర్తు చేసుకుందాం. అయితే ఏనుగులున్న అడవిలో చిన్న చిట్టెలుక కూడా ఉండవచ్చు.



అంతమాత్రాన అది సిగ్గు పడాల్సిన పనిలేదు. భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ప్రతివాడికీ హక్కు వుంది. నిజానికి వాడి బాధ్యత. భగవద్గీత ఒక రన్నింగ్ కామెంట్రీ. సంజయుడు వ్యాసుడిచ్చిన శక్తివల్ల దివ్య దృష్టితో కురుక్షేత్ర యుద్ధం చూస్తూ ఆ జరుగుచున్నది అంధుడైన ధృతరాష్ట్రుడికి కామెంటరీగా చెప్తుంటాడు. ఆ సమయంలో భీష్మ, ద్రోణ, కృప కర్ణ, దుర్యోధనాదులందరినీ చూచి వికలమయిన మనస్సుతో గురువులు, తాతలు, తండ్రులూ, కొడుకులూ, మామలూ, బంధువులూ వీళ్ళందరినీ ఎలా చంపను అని బేలగా అస్త్ర సన్యాసం చేసిన అర్జునునికి భగవంతుడైన కృష్ణుడు కర్తవ్య బోధ చేస్తాడు. యుద్ధం చెయ్యి శత్రువులని చంపు అంటాడు. ఇదంతా మళ్ళీ కామెంటరీలాగా డైరెక్ట్ స్పీచ్‌లో చెప్తుంటాడు సంజయుడు. అందుకనే భగవాన్ ఉవాచ, అర్జున ఉవాచ, సంజయ ఉవాచ (అంటే చెప్పాడు అని అర్థం) వస్తుంది. ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లో చెపితే భగవంతుడు చెప్పినట్లవదు కదా.



ఇకపోతే భగవద్గీత ఎందుకంత గొప్పదయిందో ముందు చెపుతాను. (నాకుతోచినంత వరకు) అది ఒక కథ కాదు. హీరో, హీరోయిన్‌లు వుండరు. సస్పెన్స్ లేదు. అంటే ఒక కావ్యం కాదు. అలాగే శివుడి లీలలు కానీ విష్ణు, బ్రహ్మ, దుర్గ మొదలైన వారి లీలలు చెప్పే కావ్యం కాదు. అందులో కూడా ఒక దేవుడో దేవతో హీరో, హీరోయిన్ వాళ్ళ పెళ్ళి చేసుకోవడం పిల్లల్ని కనడం, శత్రువుల్ని చంపటం (మన మనుష్యుల్లాగా కోపతాపాలు ఉంటాయి) ఉండే పురాణాలు కాదు. దేవతని పూజించు, ఇలా పూజలు చేయి అని చెప్పే మత గ్రంథం కాదు. అలాగని ఇంకో దేవతల్నీ పూజించవద్దనడు ఆ పరమాత్మ. కాకపోతే ఏ దేవతని పూజిస్తే ఆ దేవతల్లో నేనే వుండి ఆ భక్తుల కోర్కెలు తీరుస్తాను అంటాడు. అంటే మనం వెంకటేశ్వరుడిని పూజించినా, సాయిని పూజించినా, దుర్గని పూజించినా పర్వాలేదు. ఆ భగవంతుడే (వాడికి పేరులేదు పుట్టుక లేదు, ఊరులేదు సర్వాంతర్యామి) ఆ దేవతల ద్వారా ఆ కోర్కెలు తీరుస్తానని చెప్తాడు. అయితే ఆ కోర్కెలు క్షణికాలు శాశ్వతాలు కావు అంటాడు. అంటే ఏమిటో చూద్దాం. మనం

ఒక దేవుణ్ణి పూజించి స్వామీ మా అబ్బాయికి ఉద్యోగం వచ్చేట్లు చెయ్యి అని కోరుకుంటాం. వస్తుంది కానీ అది క్షణికం. ఉద్యోగంలో అతను సరిగా పనిచేయక ఉద్యోగం పోవచ్చు. మరి అప్పుడు? మనం కోరే కోర్కెలన్నీ భౌతికాలు, సుఖ కారకములు కాబట్టి అవి క్షణికాలు. ఎందుకంటే సుఖం క్షణికమే కదా. ఏ.సి.లో వుండే వాడికి విద్యుత్తు ఆగిపోతే బయటపడి భగవంతుడిచ్చిన ప్రకృతిలోకి రాక తప్పదు. క్షణికమైన సుఖం తర్వాత దు:ఖం, మళ్ళీ దాని తర్వాత అదే క్షణికమైన మరొక సుఖం తప్పవు. ఒకడికి తమ్ముడు చనిపోతాడు కానీ మనుమడు పుడ్తాడు. ఇది దు:ఖమా? సంతోషమా? అందుకనే సుఖ దు:ఖాలను సమానంగా చూడండి అన్నాడు భగవంతుడు.

అందుకే భగవద్గీత గొప్ప గ్రంధం అయింది. అది మనిషి ఎలా ప్రవర్తించాలి, ఏమి చేయాలి, ఏమి చేయకూడదు, భగవంతుణ్ణి ఎలా చేరాలి అనే చెప్తుంది. ఒక మతం గురించి కానీ, దేవత గురించి కానీ మంత్ర తంత్రాల గురించి కానీ విద్యల గురించి కానీ చెప్పదు.



అంతా అనుకున్నట్లు అది కేవలం అగ్రకులాల వారి సొత్తుకాదు. అందరూ చదవ దగ్గది. కొందరు ఇందులో శూద్రులని కించపరిచారు అన్నారు నాతో. కాదు అలా ఎన్నటికీ కాదు. విశదంగా భగవంతుడు నాల్గు వర్ణాలూ నేనే సృష్టించాను వారి కర్మల బట్టి బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్రులని అన్నాడు అది నిజమే. అంటే కర్మ సిద్ధాంతపరమైనది. శూద్రులని కించపరచడం ఎంత మాత్రం కాదు. శూద్రులలోనే ఇద్దరు అన్నతమ్ములలో ఒకడు బాగా పండితుడు ఒకడు పనికిరాని వాడు అవుతాడనుకోండి. అప్పుడు అలా ఎందుకు జరిగింది? ఇద్దరూ పుట్టింది ఒకే తల్లి తండ్రికి, పెరిగింది ఒకే విధంగా మరి ఎందుకలా జరిగింది. దానినే కర్మ సిద్ధాంతం పూర్వజన్మ కర్మఫలంగా చెపుతోంది. వాళ్ళలో ఒకడు మంచిపనులు (అంటే భగవంతుడు గీతలో చెప్పిన చేయవలసిన పనులు) చేశాడు. ఒకడు చేయకూడని పనులు చేశాడు అది కూడా వారి పూర్వజన్మలో కొంత, ఈ జన్మలో కొంత, అంటే ఇలాఅనుకుంటే అంతా అర్ధమయిపోతుంది కదా. కాబట్టి పండితుడవటం ప్రధానం కానీ కులంకాదు.



అయితే ఆ రోజుల్లో అంటే (ప్రజల రాజ్యం లేని రోజుల్లో) ఒక రాజు రాజ్యాన్ని పాలించే రోజుల్లో బ్రాహ్మణులు వేదాలు గీత మొదలయినవి చదివి జ్ఞానులై భక్తులై ఏమి చేయాలో ఏమి చేయకూడదో చెప్పవలసిన బాధ్యత భగవంతుడు విధించాడు. వైశ్యులు పశుసంపదను వృద్ధి చేసి వ్యాపారం చేసుకుంటూ ధనం ఆర్జించాలన్నాడు. ఎందుకంటే రొటేషన్‌కి డబ్బు కావాలి కదా. క్షత్రియులకు ధైర్యం యుద్ధంచేయడంలో నేర్పు మొదలైన గుణాలుండాలన్నాడు. ఎందుకంటే వాళ్ళు కాపాడాలి కదా దేశాన్ని శత్రువులనుంచి! ఇంతవరకూ సరే కానీ నా మిత్రుడికి కోపం ఎక్కడ వచ్చిందంటే శూద్రుల కర్తవ్యం వారికి సేవ చేయడం అన్నాడట ఆ భగవంతుడు. ఇది అన్యాయం కాదా? వివక్ష కాదా? అంటాడు.

ఇక్కడ శూద్రుడు అంటే మిగతా మూడువర్ణాలు కానివాడు అనిఅర్ధం.అంతే కానీ అంటరానివాడని కాదు. ఇది మధ్యలో స్వార్ధపరులు సృష్టించుకున్న జాడ్యం. సహజంగా ఏ కులంవాడు ఆ కులంలోనే వివాహాలు చేసుకోవటం వల్లనే కులద్వేషాలు



మొదలైనాయి. అంటరానితనం శూద్రులలోనూ పాటించేవారు. వారుకూడా వారిలో వృత్తులను బట్టి వేరు వేరు కులాలుగా ఏర్పడి వారివారి కులాలలోనే వివాహాలు చేసుకుంటూ ఇంకొక కులాన్ని ద్వేషిస్తూ కొన్ని రకాల పనులు హీనమయినవని తలుస్తూ వారిని అంటరాని వారుగా చూడడం మొదలు పెట్టారు. అసలు హీనమయిన పనేలేదు. పంది అసుద్ధం తినకపోతే ప్రపంచమంతా పెంటమయం. మున్సిపాలిటీలో చెత్త ఎత్తేవాళ్ళు, డ్రైనేజీ బాగుచేసేవాళ్ళు, శవాల్ని తగలబెట్టేవాళ్ళు, పాతిపెట్టేవాళ్ళు, చెప్పులు కుట్టేవాళ్ళూ, పాకీవాళ్ళూ లేకపోతే తెలిసేది ఈ ఉన్నత కులాలవాళ్ళ గతి. మరి అంతమాత్రాన వాళ్ళు అంటరానివారా? ఇది భగవంతుడు చెప్పాడా? గీత చెప్పిందా? లేదే? శూద్రున్ని మిగతా కులాల వారిని సేవించమన్నాడు. అంటే ఇంగ్లీషులో Serve చేయటం. సర్వెంట్, మనతొత్తుకాదు. అది వాడివృత్తి. వాణ్ణి కించపరిస్తే తంతాడు. (ధైర్యం మరియు ఇంకో ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటేనే). ఇక్కడ సేవించడం అంటే సెర్వ్ చేయటమేకాదు. Assist చేయడంకూడా. ఒక వైశ్యుడున్నాడు. శారీరకంగా

బలంలేదు కాని తెలివితేటలవల్ల వ్యాపారం చేస్తున్నాడు. మరి వాడికి సరుకులు తేవడానికి, ధాన్యం మూటలు తెచ్చి లోపల పెట్టడానికి మనుష్యులు కావాలి కదా. ఆ పని శూద్రులది అన్నాడు. అంటే శారీరకంగా దృఢమైన వారు కనుక వారి జీవనోపాధికి అలా సేవచేయమన్నాడు. అంతేకానీ నీవు వాడి గులాముగా కాళ్ళకి మొక్కమనలేదు. అయితే ఈరోజు నిమ్నజాతులమీద జరుగుతున్న దౌర్జన్యం ఒక్కకులం చేస్తోంది కాదు. బలం, మదమాత్సర్యాలూ, పలుకుబడి ఉన్న ప్రతివాడూ వాడికింద వాణ్ణి చేస్తున్న పనేఅది.

ఒక శూద్రునికింద ఈరోజు ఒక బ్రాహ్మణుడు పనిచేస్తూ ఏయ్ పంతులూ నోర్మూస్కుని నీపని చేస్కోఅని అనేవాళ్ళున్నారు. అది కుల అహంకారంకాదు. మనిషి అహంకారం. మరి అది వదిలిపెట్టమనే భగవంతుడు గీతలో చెప్పాడు. అది వదిలితే ఇక గొడవేముంది. ఒక కులంవాడు ఇంకొక కులాన్ని ఎందుకు అవమానిస్తాడు? కాబట్టి వృత్తి పనులు చేసే శూద్రులు కమ్మరి, కుమ్మరి, సాలె.... మొదలయిన వారు సేవచేయడం అంటే వారు చేసే పనిద్వారా అన్ని కులాల వారి పని సరిగా జరిగేట్లు



చేయటం అనేది చేయమన్నాడు. ఒక కమ్మరి కత్తి చేయకపోతే క్షత్రియుడేం చేస్తాడు. ఒక సుతారి ఇల్లు కట్టకపోతే బ్రాహ్మణుడేం చేస్తాడు. కాబట్టి గీతలో ఏ కులాన్ని కించపరచలేదు పైగా వాళ్ళ ధర్మాలు చెప్పాడు. ఎలా ఉండాలో చెప్పాడు. వాళ్ళు వేదార్హులు కారు అని వక్రభాష్యం చెప్పింది, ఆ తర్వాత కాలంలోని కుహనా పండితులే. అయితే అన్ని జాతులలో ఉన్నట్లే అగ్రకులాల్లో కూడా చెడ్డవారు (భగవంతుడు నిర్దేశించిన మంచి పనులు చేయనివారు) ఉన్నారు. ఒక చెడ్డరాజు ప్రాపకం వల్ల ఆ బ్రాహ్మణులే అధికార దుర్వినియోగం చేసి ఇలా వక్రభాష్యం చెప్పి యుండవచ్చు. కానీ వేరుకాదు.

ఎవరైనా ఈగీత చదువ వచ్చు, అర్థం చేసుకుని మంచి మనిషి అయి ఆ భగవంతుడిని చేరవచ్చును. నా భక్తుడు అని పదే పదే అంటాడు ఆ పరమాత్మ. అంతేకానీ బ్రాహ్మణుడు, వైశ్యుడు.... అని అనడు. భక్తుడెవరైనా కావచ్చు, యోగి, నిష్కామ కర్మయోగి ఏకులం వాడైనా కావచ్చు. ఏమతంవాడైనా కావచ్చు. వాడు మంచి మనిషి అవడమే అర్హత.



పురుషోత్తముడైన ఆ శ్రీహరి, శ్రీరామ చంద్రుని అవతారంలో కర్మ అవలంభించిన సామాన్య మానవుడు. మూడురోజులుపవాసం ఉండి సముద్రం సహకరించలేదని కోప్పడ్డాడు. భార్యావియోగానికి ఎంతోబాధ పడ్డాడు. తమ్ముడు మూర్ఛపోతే చనిపోయాడనుకుని ఏడ్చాడు. ఇలా కామక్రోధాలున్న మానవుడు. అయితే ఆయన చేసిన గొప్పపనులు మనం చేయలేం కాబట్టి ఆయన్ని దేవుడుగా పూజిస్తున్నాం. అంతెందుకు మనం చేయలేని పనులు చేసే ఎవరినైనా మనం హీరోగానో దేవుడుగానో గుర్తిస్తాం. అయితే వారు నిష్కామ కర్మయోగులైతే, షిర్డీసాయిగానూ, సత్యసాయిగానూ ఇలా ప్రసిద్ధి చెందుతారు. వారు భగవదవతారులుగానూ, దేవతలవంటివారు గానూ పూజించబడతారు.

మనం సుఖ కారకమైన కోర్కెలను అడిగేకొద్దీ మనం కొల్చిన దేవతలు ఆ కోర్కె తీర్చినా అది మనని భగవంతుని వద్దకు చేర్చలేదు. ఇదే మనం గీతలో తెల్సుకోవలసింది.



అయితే నాకు మోక్షం గీక్షం వద్దు. ముందు నాకు ఉద్యోగంరావాలి, రోగం తగ్గాలి, ఇల్లు కట్టుకోవాలి, పెళ్ళికావాలి ఇలాంటి కోర్కెలన్నీ రకరకాల దేవుళ్ళని కోరి, మొక్కుకొని, పూజించి, చివరికి అవి తీరినా అవి క్షణికమే మళ్ళీ కొంతకాలానికి అదే కోరిక తీరడం వల్ల ఇంకొకమార్పు జరిగి కష్టమూ, బాధ, ఆదుర్దా దానివల్ల రోగమూ తప్పవు. మరి ఆ తీరిన కోర్కె క్షణికమే కదా.

అందుకనే ఈ కోర్కెలు వదిలిపెట్టి కేవలం బ్రతకటం కోసమే ఏదో కర్మ (ఉద్యోగం) చేస్తూ భార్యాపిల్లల్ని పోషించి చదివించి సమయం దొరికినప్పుడల్లా ఆ భగవంతుని స్మరిస్తూ తన అభివృద్ధికి తనుచేస్తున్న పనులు కారణం కాదని అసలు కారణం ఆ సర్వేశ్వరుడేనని తలచి (అంటే అహంకారం లేనట్లే కదా) మితంగా తింటూ (లేకపోతే రోగం వస్తుందనే కదా) అందరిలోను పరమాత్మను చూస్తూ (గౌరవిస్తూ ఉంటే ప్రాబ్లెమ్ ఏముంటుంది) సుఖదు:ఖాలలో ఒకటిగా ఉండమన్నాడు. ఎందుకంటే అవి తోడుదొంగలుకదా. అలా ఉండగలమా అనేది వేరే ప్రశ్న. ఇది చదివి దేవుడు చెప్పాడు కదా అని పాటిస్తే మరి ప్రపంచం తప్పక బాగుపడుతుంది.

## ప్రార్థన

కం॥ శ్రీపతి దయగని బ్రోవన్
ఆపక పద్యాల తొల్లి అల్లితి గీతన్
తోపక తృప్తియు దీరక
ఈపరి వచనంపు గీత నిటు అందింతున్

శా॥ ఈ సంసార సుఖంబు శాశ్వతమహా! ఇందున్నదే
భాగ్యమౌ
ఈ సంతానము నాది నాది, విడువన్ ఏనాడు
నావారలే
ఈ సంపాదన నాది, చాలదనుచున్ ఎవ్వారినో
గొల్చితిన్
ఈ సంతాపము తోటి నిన్ను దెలియన్ ఏరీతి
వీలౌ ప్రభూ!



కం॥ మనమున మనుమన మనయని
మనమున మన నీకు మనసు మనదేమనెదన్
మన మన మానక నేనన
మన మన అని మన్ననీవు మనసిజు జనకా!

కం॥ పాపుల పాపము నాపగ
పాపము పాపయ్యె హరియు పాపుల చెరలో
పాపుల పాపము బాపుచు
పాపడు పరమాత్మ ఆయె పాపము నాపెన్

తే॥ సాయినాధుని నమ్మిన సాయమౌను
సాయి నేర్పె సబూరిని శ్రద్ధయున్న
సాయి బోలిన దైవము జగతి లేదు
సాయి చింతతో బ్రతికిన జన్మఫలము



మ॥ తలతున్ రాముడె సర్వమంచు మదినే దాల్తున్
సదా నామదిన్
పిలుతున్ ప్రాణము వోవు దాక ప్రభునే
ప్రీతిన్ అదే ధ్యాసగా
నిలుతున్ ధర్మపుత్రోవ తల్లి! తగునా నీస్వామి
కీజాగికన్
తెలుపన్ వేడెద జానకమ్మ! దయతో
దీనున్ ఇదే బ్రోవగన్

ఉ॥ కాకిని కంజజాస్త్రమున ఖండన జేయగ
జూచువాని, తా
నాకలి దీర్చ స్తన్యమిడు అన్నులమిన్నను
బట్టి జంపు, వా
డా కరుణాంతరంగుడిక ఆయన దిక్కని
యేడ్చి బిల్చినన్
చేకొను భాగ్యమేమి? నువు చెప్పవె
నా మొర అబ్ధి నందినీ!



సీ॥ సీతమ్మ మా అమ్మ శ్రీరాముడే తండ్రి
నాలుగు మొగముల నలువ అన్న
వాణి విద్యల రాణి వదినమ్మ, స్వయముగా
సురపతి పెదనాన్న, హరుడె మామ.
మము బెంచు మేనత్త మంగళ గౌరియే
అల్లుళ్ళు స్కందుడు, అగజముఖుడు.
భరతుడు, కవలలున్ బాబాయిలే మాకు
పావని, గరుడ, సుగ్రీవ, గుహులు

ఆ॥ ఆవిభీషణాదులందరు తోబుట్లు
శుకుడు, శౌనికుండు మాకు గురులు
నారదాది మునులు పేరున్న ఆప్తులు
భాగవతులు యెల్ల బంధుగణమె.

# గీతావచనము

## శ్రీమత్ భగవద్గీత

## స్వేచ్ఛా వ్యాఖ్యానం

## 1. అర్జున విషాదయోగం

"ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అనేది భగవద్గీతలోని ప్రధమ శ్లోకంలోని ప్రధమ వాక్యంలోని ప్రధమార్ధ భాగం. పెద్దలు దానిని "క్షేత్రేక్షేత్రే ధర్మకురు" అని విశ్లేషించారు. "ఆయా చోట్ల ఆయా ధర్మములను అవలంభించుము" అని దానర్ధం. గీతా సారం అంతా దీంట్లోనే వుంది. పుత్రునిగా, సోదరునిగా, స్నేహితునిగా, విద్యార్ధిగా, ఉద్యోగిగా, భర్తగా, తండ్రిగా, మామగారిగా, బావగా, తాతగా ఆయా సమయాల్లో నీకు విధింపబడ్డ ధర్మం 'నెరవేర్చు'. ఇంతకు మించిన సద్బోధ ఏముంది.

సంజయుడు వ్యాస భగవానుడనుగ్రహించిన దివ్యదృష్టితో



కురుక్షేత్రయుద్ధం చూస్తూ అంధుడైన ధృతరాష్ట్ర మహారాజుకు వివరిస్తున్నాడు. సరే కురుక్షేత్రయుద్ధం ప్రారంభమైంది. కౌరవ, పాండవ సేనలు యుద్ధ భూమిలో సిద్ధమయ్యాయి. దుర్యోధనుడు భీష్ముని సమీపించి తాతా! భీముడు రక్షించే ఆ పాండవ సేననుండి మన సైన్యాన్ని నీవే కాపాడాలి. నీవు సర్వ సైన్యాధ్యక్షుడివి అన్నాడు. అందుకు భీష్ముడు సంతోషించి భయంకరంగా శంఖం పూరించాడు. ఇరు సేనలలోని వీర శిఖామణులు వారి వారి శంఖాలు పూరించారు.

శ్రీకృష్ణుడు అర్జునుని రథం సేనల మధ్యకు తెచ్చి నిలిపాడు. తన వారిని చూచి వీరి చంపి, పాపం ఎలా మూటకట్టుకోను అని అర్జునుడు వ్యాకులపడ్డాడు. ముష్టి ఎత్తుకుని జీవిస్తానుకానీ నావాళ్ళని చంపి సంపాదించే ఈరాజ్యం వద్దు అన్నాడు. ఇదంతా కేవలం మా రాజ్యకాంక్ష కోసం జరుగుతున్నది, ఇదివద్దు అని ఒకరాజు అనడం నిజంగా గొప్పవిషయమే. అయితే ఇక్కడ అలా యుద్ధం నివారించుట భగవంతునికిష్టంలేదు. యుద్ధం ఆపాలని రాయబారం చేసిన ఆ పరమాత్మయే యుద్ధం ఎందుకు



చేయమన్నాడంటే అది అనివార్యం, కాబట్టి. కౌరవులు దుర్మార్గులమూక. దుష్ట శిక్షణకే పుట్టిన వానికి అది యుద్ధంకాదు, దుష్టశిక్షణే. శిశుపాలుని చంపింది హత్యకాదు, దుష్టశిక్షణ. దుష్టశిక్షణ చేసేటప్పుడు ఇవన్నీ ఆలోచించకు, నీకర్తవ్యం నెరవేర్చు అన్నాడు పరమాత్మ. ఈరోజు న్యాయ వ్యవస్థలో కూడా ఒకదుష్టుడు అన్యాయం చేస్తుంటే వాని నాపటంలో స్వరక్షణ కోసం చంపమనే న్యాయం చెపుతుంది. అయితే అది దుర్వినియోగం చేయకుండటం కోసమే ఎన్నో కట్టడులున్నాయి. అది వేరేసంగతి.

## 2. సాంఖ్య యోగం

రెండవ అధ్యాయం సాంఖ్యయోగం. ఇందులో పరమాత్మ అర్జునుని శాంతింపజేసి యుద్ధ సన్నద్ధుని చేయటానికి చావు పుట్టుకల రహస్యం, ఆత్మజ్ఞానం, మానవులందరూ కోరే సచ్చిదానందమైన భగవదైక్యం, దాన్ని పొందటానికి ఉన్న రెండు మార్గాలు సాంఖ్యయోగం, కర్మయోగం గురించి చిన్న విపులీకరణ, స్థిత ప్రజ్ఞత, ఇంద్రియ నిగ్రహం, బ్రహ్మానందం పొందటం ఎలా అనే అంశాలు వివరిస్తాడు. భగవద్గీతలో ఇది చాలా ముఖ్యమైన అధ్యాయం.



అర్జునుడు ముందుగా **ఓ కృష్ణా! బంధువులమీద ఉండే వాత్సల్యం వల్ల నాకు కర్తవ్యం బోధ పడడంలేదు. ఈ హత్యలు చేయలేను, నాకు రాజ్యము వద్దు** అంటాడు.

భగవంతుడిలా అన్నాడు **ఓఅర్జునా! పిరికిపందలా మాట్లాడకు. అసలు చచ్చేదెవరు? చంపేదెవరు? చావంటే ఏమిటి? శరీరంనుంచి ప్రాణం పోవటం. ఆత్మ చావులేనిది. శీతోష్ణాలు లేవుదానికి, నీటిలో తడవదు, ఆత్మ అగ్నిలో దగ్ధమవదు, విచారం సంతోషం లేవు దానికి. ఆత్మ మనిషి శరీరమంతా, కోటలో ఉన్నట్లుంటుంది. మనం మురికి బట్టలు వదిలేసి కొత్తవి ధరించినట్లు పాతబడ్డ ముసలి జీర్ణించిన శరీరం వదలి ఇంకొక శరీరంలో ప్రవేశిస్తుంది. దీన్ని ఆపడం ఎవరి వల్లాకాదు. ఈ ప్రక్రియే చావు. అంతే. దీనికోసం బుద్ధిమంతులు విచారించరు. ఏదన్నా నిత్యము, తధ్యము అంటూ ఉంటే అది చావే. కాబట్టి దానికి చింతించడం తగునా? నీవు చంపకపోయినా వాళ్ళు చచ్చేది తప్పదు. ఎందుకంటే వాళ్ళని చంపేది నువ్వుకాదు. వారి దుష్కర్మలే వారి చావుకి కారణం. సర్వవిశ్వానికి ఆధారమైనది**

నిర్వికార నిరంజనుడైన పరమాత్మ. మరి ఇప్పుడు నువ్వు యుద్ధమాపి శత్రువులలో చులకన అవటం కంటే మరణించి వీరస్వర్గం పొందటం నయంకదా. జయాపజయాలు తెలిసేది ఎవరికి? వాటి ఆలోచన నీకు అనవసరం. నీవిద్యుక్త ధర్మం (కర్మ) చెయ్యి. ఫలితం పరమాత్మకు వదులు. దాని గురించి ఆలోచించకు. అప్పుడు దాని ఫలము నీకు అంటదు. కాబట్టి నీకే దోషమూ అంటదు. ఏ కోరికా లేకుండా ఆచరించే కర్మలవల్ల ముక్తే కానీ పాపం రాదు.

కేవలం స్వర్గ సుఖాలు కోరి యజ్ఞయాగాల వంటి కర్మలు చేసేవారు స్వర్గంచేరి సుఖాలు పొందినా నిత్యానందకరమైన భగవంతుని చేరలేరు. నిజంగా భగవంతుని కోరి వానిలో లీనమయ్యే వానికీ ప్రాపంచిక సుఖాలతో పనిలేదు. చక్కగా నదిలో స్నానంచేసేవాడు బావిలో స్నానం చేయాలనుకోడు కదా.



సుఖదు:ఖాలు, శీతోష్ణాలు, మానావమానాల యందు ఎవడికైతే సమబుద్ధి ఉంటుందో వాడు పాపపుణ్యములను వదిలివేసి పరమాత్మయందు మనస్సు నుంచగలుగుతాడు. అలాగే మోక్షం సాధించగలడు.

వాడే స్థితప్రజ్ఞుడు. వాడికి భయ క్రోధాలు, రాగద్వేషాలు, సుఖదు:ఖాలు, ఇష్టాయిష్టాలుండవు. ఇంద్రియాలన్నిటినీ అవి కలిగించే సుఖాలనుండి వేరు చేయకలడు. తద్వారా విషయాసక్తి నశించి కామ,క్రోధ,మోహ,మదములనుండి విముక్తుడయి పరమాత్మ తత్త్వమెరిగి పరమశాంతి పొందుతాడు. బ్రహ్మాపదం పొందగలుగుతాడు.

ఇదీ ఈ రెండవ అధ్యాయ సారాంశం. ఇక దీనివల్ల మనకేం లాభమో చూద్దాం. మనిషి సహించలేనిదీ భయపడేదీ చావునే. ఆ చావు గురించి తెలుసుకుని విచారించని స్థితికి చేరగలిగితే మనిషికి ఇక దు:ఖ కారణమేముంటుంది? చావుకి భయపడని, దు:ఖించని వాడికి ఇక తిరుగేముంది?

ఇక జయాపజయాల గురించి ఆలోచిస్తూ కర్తవ్యం



వదిలేయకు అన్నాడు పరమాత్మ. అంటే గాల్లోదీపంపెట్టి దేవుడా కాపాడు అనవద్దన్నాడు. దాన్ని ఆరకుండా ప్రయత్నం చెయ్యి. ఫలితం నామీద వదులు. అది ఆరిపోతే ఏడవకు. ఆరకుండా ఉంటే అహా! నేనెంత గొప్పవాణ్ణి అనుకోకు అన్నాడు ఆ భగవంతుడు. అంటే కేవలం తిరుపతి మొక్కులు మొక్కేవాళ్ళకేం రాదనే కదా అర్థం. నీ ప్రయత్నం చేసి నాకు మొక్కు నేను చూసుకుంటా అన్నాడు. That gives confidence to ordinary human beings like us who are always doubting Toms.

భగవానుడు ఇంద్రియాలు ఇచ్చే సుఖం నుండి విముక్తి పొందమన్నాడు. Fan ఆగిపోయి (కరెంటు పోయి) వెయ్యి తిట్లు తిట్టే మనకి ఇదెలా సాధ్యం? కాదు, అందుకే ఆ మార్గమూ ఆయనే చెప్పాడు. సాధన వల్ల ప్రయత్నంవల్ల అదిసాధ్యం అన్నాడు. అది సాధిస్తే ఇక మనకి దు:ఖం అనేదే వుండదు. పరదూషణ వల్ల వచ్చే పాపమూ రాదు కదా.

అలాగే నిష్కామ కర్మ. ఇది ఈ చేతనా ప్రపంచంలో



పూర్తిగా ఆచరించలేని సంగతే. కానీ దీని అవసరం ఎంతైనా వుంది. కోర్కెలేకుండా ఏ పనైనా ఎలా చేయగలం? పాసవడానికే కదా చదివేది, అమ్మాయి సుఖపడాలనే కదా మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేది. అబ్బాయికి మంచి ఉద్యోగం రావాలనే కదా బాగా చదివించేది. రోగం తగ్గాలనే కదా మందులు వేసేది. ఇలా ఎన్ని ప్రశ్నలైనా వేయవచ్చు. కానీ ఈ కోర్కె ఉండడం సహజమైనా ఆ కోర్కెవల్ల నష్టం చూడండి. అది తీరకపోతే కలిగే బాధ? అప్పుడొక వితండవాదానికి వీలుంది. నాకు పాసవాలనే కోర్కె ఉండకూడదు కదా. నేనెందుకు చదవాలి అంటే ఒరే నీ కర్తవ్యం నువ్వు చెయ్యి అన్నాడు కదా. మరి సరిగ్గా చదువు (మెట్ట వేదాంతం వదిలేసి). దురదృష్టం కొద్దీ పాసవకపోతే ఏడ్చి ప్రాణం తీసుకోకు. అలాగే నీశాయశక్తులా కృషిచేసి అన్నీ విచారించి మంచి సంబంధం చూసి అమ్మాయికి పెళ్ళి చెయ్యి. కానీ దాని పూర్వజన్మ కర్మవల్ల వైధవ్యం వస్తే దేవుణ్ణి తిట్టక. ఏడ్చి దాన్ని ఏడ్పించకు. అలాగే చేయాల్సిన ప్రయత్నాలు చేసి డబ్బు ఖర్చుపెట్టి అబ్బాయిని చదివించు. మంచి ప్రయోజకుడైతే సంతోషించు లేక వాడికి ఉద్యోగం

రాకపోతే ఏడ్చి వాడినేడిపించి వాడు కృశించేలా చేయకు. ఇదే సింపుల్‌గా భగవంతుడు చెప్పింది. ఇంతకంటే మనమంచికోరే ఎవడైనా ఏం చెప్పగలడు.

నిష్కామం అంటే ప్రతిఫలంపై కోర్కె లేకుండుట. ఇది ఎంతో కృషిమీద వస్తుంది. మున్ముందు ప్రతిఫలాపేక్ష వదులు సగం దు:ఖం పోతుంది. ప్రతిదానికీ పెడర్థాలు తీసేవాళ్ళని ఏమీ చేయలేం నిజానికి కోర్కెలన్నీ చివరికి దు:ఖదాయకాలే. వాటివల్ల వచ్చే సుఖం క్షణికం. మంచి ఉద్యోగం వచ్చింది. ఇవాళ కోర్కె తీరింది. రేపు ఆ ఉద్యోగం పోవచ్చు. అందులో అవమానం కలగొచ్చు. శిక్షలు పడవచ్చు. అప్పుడు? అందుకని ఇంద్రియాలకు సుఖం ఇచ్చే ఏ కోర్కె తీరినా అది క్షణికం అని గ్రహించి భగవంతుని చేరటానికి ప్రయత్నం చెయ్యి నాయనా అన్నాడు. అలాగని అన్నిటినీ వదిలి కర్మ త్యాగి కావద్దు అని చెప్పాడు. నీ కర్తవ్యాలను నెరవేరుస్తూ స్థితప్రజ్ఞుడిలా ఉంటూ, నన్నే ముఖ్యునిగా భావించి ముక్తి పొందు అన్నాడు. అసలీ భగవద్గీతలో సారం స్థితప్రజ్ఞతే. దీనికి ఎంతోమంది ఎన్నో



అర్థాలు చెప్పారు. కానీ సింపుల్‌గా చెప్పుకోవాలంటే ఎవడైతే సుఖదు:ఖాలు, శీతోష్ణాలు మానావమానాలు, లాభనష్టాల సమంగా భావించి, తన కర్తవ్యాన్ని నిష్కామంగా నెరవేరుస్తూ, ఇంద్రియ సుఖాలని క్షణికాలని భావిస్తూ, కామక్రోధ మోహమదాలను అణచి ప్రతి జీవిలోనూ భగవంతుని చూడకలిగి, అందరినీ తనలా చూసుకోగలిగిన వాడు స్థిత ప్రజ్ఞుడు. ప్రయత్నిస్తె అది సాధించడం సాధ్యమే.

## 3. కర్మ యోగం

ఇక 3వ అధ్యాయం కర్మయోగం గురించి తెలుసుకుందాం. అర్జునుడికో సందేహం వస్తుంది. **ఓ కృష్ణా! నువ్వు కర్మ కంటే జ్ఞానం ఉత్తమమైంది అన్నావు. అటువంటప్పుడు నన్ను యుద్ధం చెయ్యిఅని చెడు కర్మకి ఎందుకు ఆదేశిస్తున్నావు** అని అడుగుతాడు.

దానికి భగవంతుడు కర్మయోగం గురించి చెపుతూ **పాంచభౌతికమైన ఈ ప్రపంచంలో ఏ మనిషీకూడా కర్మలు చేయకుండా జీవించలేడు. ప్రకృతి జనితములైన త్రివిధములైన**



**సత్త్వ,రజ తమోగుణాలచే ప్రేరేపితుడై మనిషి ఏదో ఒక కర్మచేసి దాని ఫలితం అనుభవించక తప్పదు. (మరి మార్గం ఏమిటి? బలవంతంగా ఇంద్రియాలను నిగ్రహించి అయ్యో వాటి సుఖం కోల్పోయానని ఏడిచే కపటి ఉత్తదాంభికుడు.) కర్మలు ఆచరించాలి కానీ శాస్త్రవిహితములైన కర్తవ్య కర్మలనే ఆచరింపవలెను.**

**ప్రజాపతి, ప్రజలకు నిర్దేశించిన యజ్ఞ యాగాదులు శాస్త్రవిహితంగా నిర్వహించి, యజ్ఞంలో మిగిలిన అన్నాన్ని తినేవాడు శ్రేష్ఠుడవుతాడు, పాప విముక్తుడవుతాడు. అలాకాక, దేవతలకి పెట్టక తినేవాడు పాపి అయితీరుతాడు. ప్రాణులు జీవించేది అన్నంతో, అన్నం వచ్చేది వానల వల్ల, అవి కురిసేది యజ్ఞంవల్ల, ఆ యజ్ఞ విహిత కర్మ వేదం ద్వారా వస్తుంది. మరి ఆ వేదాన్నిచ్చిన నాశరహితుడగు పరమాత్మ వీటన్నిటి కంటే శ్రేష్ఠుడు.**

**అందుకని చేయాల్సిన కర్మలన్నీ కర్తవ్యం కోసమే చేయాలి. (జనక మహారాజులాగా) ఆసక్తి రహితమైన**



**కర్మాచరణం వల్ల జ్ఞానులు పరమసిద్ధిని పొందగలుగుతున్నారు. అలాగే నీకు కూడా కర్మ చేయుట తగినపని.**

**ఓ అర్జునా! ఉత్తమ పురుషులు ఏ కర్మలు చేస్తే ఇతరులంతా వాటినే ఆచరిస్తారు. వాని ప్రమాణమే లోకమున సకల మానవులకూ ప్రమాణమగును. అందుచేత నాకు కర్తవ్యమంటూ ఏమీలేకపోయినా నేనే సర్వేశ్వరుడనయినా కర్మలు చేస్తాను. అందునా సత్కర్మలు చేస్తాను. లేకపోతే నన్నే అనుసరించి ఈ ప్రజలు నాశనమయిపోతారు.**

ఎంతగొప్ప సందేశమో చూడండి. అందుకనే పరమాత్మ కూడా సాందీపుని వద్ద శిష్యరికం చేశాడు. అన్నగార్కి తలలో నాలుక లాగా ఉన్నాడు. నిందలు భరించాడు. దీనులను రక్షించాడు.

దీనివల్ల తెలిసేదేంటంటే మనం ఉత్తములయినంత మాత్రాన సరిపోదు. సత్కర్మలని చేస్తూ అందరికీ త్రోవ చూపించాలి. ఇక ఆ స్థితి వచ్చాక గర్వం ఎక్కుతుంది కదా. అందుకనే మళ్ళీ భగవంతుడు అంటాడు **నీవు అట్లు గొప్ప**

జ్ఞానివయినా అజ్ఞానులను ఆక్షేపించ రాదు. కర్మ విముఖులను చేయరాదు. వారిని విచలితులను చేయరాదు.

సకల కర్మలను నాకర్పణ గావించి, ఆశ మమకారం వీడి నన్నే స్మరిస్తూ నామతం మీద నమ్మకం ఉంచి నాపై దోషారోపణ చేయకుండా మోక్షం పొందాలి. ఏ ఇంద్రియ విషయంలోనూ రాగద్వేషాలు తప్పవు. అవే భయంకర శత్రువులై మనం చేసే కర్తవ్య కర్మలకు అవరోధాలవుతాయి.

ఒక మనిషి పరధర్మాన్ని చక్కగా చేసే కంటే తన ధర్మాన్ని కొంత దోష పూరితంగా చేసినా మంచిదే. ఆ స్వధర్మంలో మరణించినా శ్రేయస్కరమే కానీ పరధర్మాచరణ మాత్రం అతిభయంకరం.

అప్పుడు అర్జునుడికింకో సందేహం వచ్చింది. ఓ దేవా! మరి ప్రకృతివల్ల ఇంద్రియాలవల్లనే మనిషి కర్మలు చేస్తున్నాడంటున్నావు కదా మరి ఎవరి ప్రేరణ వల్ల పాప కర్మలు చేస్తున్నాడు – అని అడిగాడు.

దానికి భగవంతుడిచ్చిన సమాధానం మన అందరికి



కనువిప్పు.

రజోగుణం వల్ల కామం అంటే కోరిక కలుగుతుంది. ఆ కోరిక తీరకపోతే క్రోధం కలుగుతుంది. ఈ కామం మహా తిండిపోతు ఎంత అనుభవించినా దానికి తృప్తిలేదు. పైగా అది అద్దాన్ని దుమ్మూ, గర్భస్థ శిశువును మావి కప్పినట్లు ఈ కామం జ్ఞానాన్ని కప్పేస్తుంది. ఇక ఈ కామం మనస్సును, బుద్ధిని, ఇంద్రియాలని తన చెప్పు చేతల్లో ఉంచుకుని జీవాత్మని మోహింపచేస్తుంది. అందుచేతనే మనిషి పాపకర్మలు చేస్తాడు. అందుకని అర్జునా ముందు ఇంద్రియాలని వశపరచుకో తర్వాత జ్ఞానాన్ని నాశనం చేసే కామం అనే శత్రువుని నరికివేయి. ఆత్మ జ్ఞానం చాలా అవసరం దీనికి, ఎందుకంటే ఈమనిషి స్థూల శరీరం కన్నా ఇంద్రియాలు, వాటికన్నా మనస్సు, దానికన్నా బుద్ధి, ఆ బుద్ధికన్నా ఆత్మ శ్రేష్ఠమైనవి కనుక.

ఇది ఈ కర్మయోగంలో పరమాత్మ చెప్పిన సంగతి. తనకోపమె తన శత్రువు. తన శాంతమె తనకు రక్ష అని ఎక్కణ్ణుంచి వచ్చింది? ఇక్కణ్ణుంచే. కోపమే లేకుంటే అసలు



పాపాలెవడు చేస్తాడు. అప్పుడు మనిషి జీవితంలో నేరం లేదు, శిక్షలేదు, నొప్పిలేదు. అంతా శాంతి, సంతోషం. ముక్కు మూసుకుని జపం చేసే కంటే సత్కర్మలు మనిషికి ఉపయోగించే కర్మలు చేయండి. మీకంటే అజ్ఞానులకి కర్తవ్యం బోధించి మంచి పనులు చేయించండి. ఇంద్రియ సుఖాల మీంచి మనస్సుని మళ్ళించి (అదీ సాధన ద్వారా, మెల్లగా....) పరమానందం పొందండి. భగవంతుణ్ణి మీ అండగా కోరి సత్కర్మలు చేయండి. ఇదీ 3వ అధ్యాయంలో కర్మయోగం మనిషికి నేర్పేది. Is it not what is wanted in this crime packed world? Just think.

## 4. జ్ఞానయోగం

పరమాత్మ అర్జునునితో తను ఈ జ్ఞానయోగం సూర్యునికి బోధిస్తే ఆయన వైవస్వతమనువుకు, ఆయన ఇక్ష్వాకు చక్రవర్తికి ఆ విధంగా రాజర్షులకుచెంది చివరికి కాలంతో మరుగునపడిందని అర్జునుడు తన మిత్రుడైనందున మళ్ళీ చెప్తానని అంటాడు.



అర్జునుడి సందేహం కృష్ణుడు తన ఈడువాడు కదా కల్పాల కొద్దీ ఆయువున్న సూర్యుడికెలా బోధ చేశాడని.

మరి ఆ భక్తుడికి భగవంతుడు బోధించిన జ్ఞానమే ఈ జ్ఞానయోగం. ఇది చాలా ముఖ్యమైన అధ్యాయం. భగవంతుడి తత్త్వం తెలిపే అధ్యాయం.

భగవంతుడేమంటాడో చూద్దాం. ఓ అర్జునా మన మధ్య ఎన్నో జన్మలు జరిగాయి. నీకు గుర్తులేదు కానీ భగవంతుడైన నాకు గుర్తుంది. అసలు పుట్టుకే లేనివాడినైనా నేను నా యోగ మాయచేత నన్ను నేనే ఈ ప్రపంచంలో సృజించుకుంటున్నాను, అది కూడా ఎప్పుడైతే ధర్మం నశించిపోతూ అధర్మం ప్రబలుతుందో, దుష్టులు సన్మార్గుల్ని బాధపెట్టి చెలరేగుతుంటారో అప్పుడు దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం ధర్మాన్ని నిలపటంకోసం నేను జన్మలనే అవతారాలను ఎత్తుతాను. అదీ నాయోగ మాయవల్ల నన్ను నేనే సృష్టించుకుంటాను.

అందుకే ఆ అవతారాలలో భగవంతుడు మానవుల్లాగానే త్రిగుణాత్మకంగా ప్రవర్తించాడు. నరసింహుడి ఉగ్రం,

వామనుడుగా భిక్షాటన, రాముడుగా శోకం కృష్ణుడుగా ఆకతాయితనం చూపాడు. నిజానికి ఆయనికి ఈ కర్మలేవీ అంటవు. ఇదంతా ఆయన మాయ. ఇది తత్త్వ దృష్టితో తెలుసుకున్నవాడికి మరల జన్మలేదని చెపుతాడు పరమాత్మ.

అర్జునా! ఏ భక్తులు ఎలా నన్ను కొలిస్తే వారినలా కరుణిస్తానంటాడు. ఒకవేళ నన్ను కాకుండా సత్వర ఫలితాల కోసం మిగతా దేవతలని ఆరాధించినా తప్పు లేదు కానీ ఆ భక్తులు నా తత్త్వాన్ని మాత్రం గ్రహించలేరు.

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులనే నాల్గు వర్ణాలను నేనే వారి వారి కర్మల ననుసరించి విభజించాను. కానీ వారి కర్మలకు నేను కర్తను కాను. నాకు కర్మఫలంమీద ఇచ్ఛ కానీ బంధం కానీ ఉండదు. నా ఈ తత్త్వం తెలిసిన జ్ఞానులకు కూడా కర్మల బంధం అంటదు. కావున నా గురించిన జ్ఞానం తెలుసుకుని మరీ కర్మలు చెయ్యి.

కర్మ, అకర్మ, వికర్మల రూపగుణం తెలుసుకుంటే



కర్మయందు అకర్మను అకర్మయందు కర్మను గుర్తించగలిగితే మానవుడు బుద్ధిమంతుడవుతాడు. కర్మయోగి అవగలుగుతాడు. అయితే ఈ కర్మయోగికి ఉండవలసిన లక్షణాలు ఏమిటంటే ఫలమునాశించకుండా శాస్త్రవిహితమైన కర్మలు చేయటం, ప్రపంచంలో దేనిమీద ఆధారపడక పరమాత్మయందే తృప్తి వహించడం, అంత:కరణ మరియు ఇంద్రియాలతో బాటు శరీరాన్ని కూడా జయించడం, సమస్త భోగ సామాగ్రినీ పరిత్యజించడం, కేవలం శారీరక ధర్మాలకి చెందిన కర్మలనే ఆచరించి దొరికిన వస్తువులతో తృప్తిచెంది యుండడం, ఈర్ష్యా హర్ష శోకాలని పట్టించుకోక పోవటం, దేహాభిమానమూ మమత వదిలి వేయటం.

ఇట్లు చేయగలిగిన కర్మయోగి తప్పక పరమాత్మ జ్ఞానంతో స్థిరముగా ఉండగలడు. ఇక ఆ తర్వాత పరమాత్మ వేద విహితమైన ఎన్నో యజ్ఞాలగురించి అర్జునుడికి తెలియచెప్తాడు. బ్రహ్మయజ్ఞం అంటే అందులోని యజ్ఞ సామగ్రి, హోమద్రవ్యాలు, యజ్ఞకర్త, అగ్ని, అందులో కాల్చే క్రియకూడా



బ్రహ్మ స్వరూపం అవుతుందో అదే బ్రహ్మయజ్ఞం. దానివల్ల కలిగే ఫలముకూడా బ్రహ్మమే. దేవతల పూజ కూడ ఒకరకమైన యజ్ఞమే. ఇక ఆత్మరూప యజ్ఞం అంటే అగ్నియందు పరమాత్మ రూపదర్శనం చేస్తూ హవనం చేయటం. జ్ఞానేంద్రియములను నియంత్రించటం ఒకయజ్ఞం. ఘోరమైన తపస్సు చేయటం ఒక యజ్ఞం, ద్రవ్య యజ్ఞమనగా నేయి మొదలగు వేదవిహిత పదార్థములను పవిత్రమైన అగ్నిలో హననం చేస్తూ చేసే కర్మ. అహింస మొదలైన కఠిన వ్రతదీక్ష చేయుట కూడా ఒక యజ్ఞం. ప్రాణాయామం కూడా ఒక యజ్ఞం. నియమిత ఆహారం తీసుకుంటూ ప్రాణాపాన వాయు నిరోధన కూడా ఒక యజ్ఞం. ఇలా ఎన్నెన్నో యజ్ఞాలను వేదం చెప్పింది. ఎందరో యోగులు రకరకాల యజ్ఞాలు చేస్తున్నారు. ఇవి అన్నీ మనస్సు ఇంద్రియాలు శరీరం ద్వారానే జరిగే కర్మలు. అయితే ఇటువంటి యజ్ఞాలన్నిటికన్నా శ్రేష్టమయినది జ్ఞానయజ్ఞం. దాంట్లో కర్మ అంతా జ్ఞానములో సమాప్తమవుతుంది.



ఇప్పుడు భగవంతుడు ఆ జ్ఞానం గురించి బోధిస్తాడు. ఈ జ్ఞానం ఎలా వస్తుంది? గురువుల ద్వారా వస్తుంది. ఈపైన చెప్పిన యజ్ఞాలలో దేన్లో ఒకటయినా ఆచరించి భగవద్దర్శనం పొందిన గురుడు కావాలి. ఆ గురునికి భక్తితో సాష్టాంగ నమస్కరించి పరిచర్యలు చేసి మెల్లగా ప్రశ్నించి ఆయననించి పరమాత్మ తత్త్వాన్ని సరిగ్గా తెలుసుకోవాలి.

తార్కికంగా ఆలోచిస్తే వేరే ఏ బాబా అయినా స్వామి అయినా వారు భగవత్ స్వరూపులైన గురువులు మాత్రమే భగవంతుడు కాదు. అయినా మనని పరమాత్మ దగ్గరకు చేర్చే సాధనమే ఆ గురువు. అందుకే ఆయన్ను పూజించాలి.

అయితే వాళ్ళవాళ్ళ కోర్కెలు తీరటానికి ఈ గురువులను పూజించి కోర్కెలు తీరాక వారినే భగవంతుడు అనుకోవటం సహజం. నిజానికి అన్నంపెట్టిన వాడే దేవుడు అని నమ్మేమనం ఇలా భావించడంలో తప్పులేదు. కానీ కోర్కెలు తీరనపుడు అదే గురువులను తిట్టే ఘనులూ ఉన్నారు. భగవంతుడు చెప్పింది

జ్ఞానం కోసమయితే మనం పూజించేది కోర్కెలకోసం. కానీ గురువులంతా మీ కర్మఫలం అనుభవించక తప్పదనే చెప్పారు. ఎవరుగూడా మేం భగవంతులం అని చెప్పలేదు. మనం అనుకుంటున్నాం.

సరే ఆ సంగతి అలా ఉంచి, ఈ తత్త్వజ్ఞానం సంపాదన కలిగితే పాప విముక్తి తథ్యం. **జితేంద్రియుడైన జ్ఞాని పరమశాంతిని పొందుతున్నాడు. అయితే నిత్యశంకితుడైన మూర్ఖుడు మాత్రం ఇహపర సుఖాలు రెండు పోగొట్టుకుంటున్నాడు. కర్మయోగి నెలా కర్మఫలం బంధించలేదో జ్ఞాన యోగిని సైతం కర్మలు బంధించవు. ఇక మరి కర్మఫలమనే పాపం అంటనప్పుడు ఓ అర్జునా ఇంకా సందేహాలెందుకు. కర్మయోగి అయి యుద్ధంచెయ్యి. అజ్ఞాన రహితుడవయి నాగురించిన పూర్తి జ్ఞానం గ్రహించి సందేహ విముక్తుడివి కావలసింది.** ఇట్లు జ్ఞానయోగాన్ని బోధిస్తాడు పరమాత్మ అర్జునునికి.

## 5. కర్మ సన్న్యాస యోగం

ఇక 5వ అధ్యాయమైన కర్మ సన్న్యాస యోగం గురించి



తెలుసుకుందాం. అర్జునుడికి ఒక సందేహం వచ్చింది. మొదటినుంచీ నన్ను కర్మ చేయమని యుద్ధంచేయమని ప్రోత్సహించిన నువ్వు కాసేపు కర్మ సన్న్యాసం మంచిదని, సాంఖ్యయోగం గురించి చెప్తున్నావు కదా! ఈ రెండింటిలో ఏది శ్రేష్టమో నాకు విశదీకరించు అంటాడు.

అప్పుడు భగవానుడు **అర్జునా! ఈ రెండు అంటే కర్మయోగము, కర్మ సన్న్యాస యోగమూ గొప్పవే. రెండూ వేరువేరని అనుకునే మూర్ఖులు వాటి దారులు వేరేకానీ గమ్యం ఒక్కటే అని తెలుసుకోలేరు. చక్కగా జరిపిన కర్మయోగం ఏ విధంగా సచ్చిదానంద స్వరూపాన్ని పొందచేస్తుందో కర్మ సన్న్యాసయోగం కూడా ఇదే విధమైన పరమానంద గతిని పొందిస్తుంది.**

**అయితే కర్మయోగ రహితమైన సన్న్యాసము అంటే సకల ఇంద్రియములూ శరీరం ద్వారా జరిపే కర్మలన్నీ వాటంతటవే జరుగుచున్నవని తాను కర్తను కాదని భావించి సన్న్యసించుట చాలా కష్టము. అయితే కర్మయోగి శీఘ్రముగా పరమాత్మను**



**పొందగలడు.**

**సాంఖ్యయోగం అంటే కర్మ సన్న్యాసం ఆచరించటానికి ఒక సాధనే ఆవశ్యకం. కానీ ఆ సాధన ఎన్నేళ్ళు పడుతుందో తెలియదు. కాగా సాంఖ్యయోగికుండాల్సిన లక్షణాలు అలవడాలంటే ఇంకా కష్టం. మరి ఆ లక్షణాలేమిటి? వినుము.**

**అతడు చూస్తున్నా, వింటున్నా, నడుస్తున్నా, నిద్రిస్తున్నా, మాట్లాడుతున్నా ఇట్లా ఇంద్రియాలతో ఏ పనిచేసినా ఇదంతా ఇంద్రియాల పనే కానీ తనకి సంబంధం లేదనుకుంటాడు. సకల కర్మలను పరమాత్మకు అర్పించి దేనియందు కూడా ఆసక్తిలేక తామరాకుపై నీటి బొట్టులా ఉంటాడు. అటువంటివాడు తాను ఏ కర్మలూ చేయకుండానే ఈ నవరంధ్ర నిర్మిత దేహంలో మానసికంగా కర్మలన్నీ త్యజించి సచ్చిదానంద స్వరూపుడగు పరమాత్మలో నిలచి ఉండగలడు.**

**కర్మయోగి మాత్రం ఇంత కష్టపడకుండా కర్మఫల త్యాగంతో కర్మలు చేస్తూ భగవదైక్యం చెందుతున్నాడు. అయితే**



**వారిలో కోరికలు అణచలేనివారు మళ్ళీ భ్రష్టులై ఫలాసక్తిచే కోరిన ఫలమును పొంది మళ్ళీ కర్మబంధాలలో చిక్కుతారు.**

మన విశ్వామిత్రుణ్ణి తీసుకోండి. ఘోరతపస్సు అనే యజ్ఞంతో భగవత్సాక్షాత్కారం పొందగలిగి కూడా ఇంద్రియాలకులోనై మేనకను ప్రేమించి తపస్సు చెడగొట్టుకున్నాడు. మరి ఇదంతా ఎందుకు జరిగింది. కొంతమంది మూర్ఖులు మంచి జరిగితే తమగొప్ప అని చెడుజరిగితే భగవంతుడి తప్పనీ నిందిస్తారు. మరికొంతమంది మూర్ఖులు రెండింటికీ భగవంతుడే కారణమని భావిస్తారు. కానీ నిజానికి ఆదిమధ్యాంత రహితుడికి ఒకరి కర్మలయందు ఆసక్తే లేదు. ఆయన ఎవరి చేతా పుణ్య కర్మలు కానీ పాపకర్మలు కానీ చేయించడు.

**యోగి ఆ పరమాత్మ తత్త్వం తెలుసుకొని తన జ్ఞాన బలంచే పాపరహితుడై పరమగతి పొందాలి. ఇది అంత తేలికా? కాదు. ఇంకొకటి ఆ సాంఖ్యయోగి సమదర్శి కావాలి అంటే అతను పండితుడైన బ్రాహ్మణుని, ఆవుని, ఏనుగును, కుక్కను**

**మరియు ఛండాలుని కూడా ఒకే విధంగా సమంగా చూడగలడు.**

పేరేదయినా ఒక్కరే భగవంతుడు. ఆయన దోషరహితుడు. కోపతాపాలు యోగులకి కూడా ఉండవచ్చు కానీ ఆ భగవంతునికి ఉండవు. ఆదిశంకరుని నుంచి నేటి ఆధునిక ప్రవక్తల దాక అంతా చెబుతున్నది ఇదే.

ఇంకా పరమాత్మ కర్మ సన్యాసయోగినే వర్ణిస్తున్నాడు. **అర్జునా! అతను హర్ష ఉద్వేగాలకి అతీతుడైన స్థిరచిత్తుడు. కామక్రోధాల వల్ల కలిగే ఆవేశాన్ని సహించగలడు.**

**అతను తుది మొదలు కలిగి అశాశ్వతములైన ఇంద్రియ సుఖాలయందు ఏమాత్రం ఆసక్తి చెందియుండడు. సచ్చిదానంద రూపుడగు పరబ్రహ్మలో ఐక్యము పొంది శాంత బ్రహ్మను పొందగలడు. సర్వ ప్రాణుల హితమునందు తత్పరులై మనస్సును జయించి నిశ్చలముగా పరమాత్మలో నిలచియుంటారు. అటువంటివారినే బ్రహ్మవేత్తలు అంటారు.**



**అటువంటివారిని నలువైపుల నుండియు శాంత పరబ్రహ్మ పరమాత్మయే పరిపూర్ణముగా ఆవరించియుండును.**

దీనివల్ల మనకేం తెలుస్తోంది. పరమయోగులు ఈ బయట కుహనా ప్రపంచంలో పిచ్చివాళ్ళలా కనపడతారు. వాళ్ళకి బాహ్యప్రపంచ స్పృహే ఉండదుకదా. తనకు కష్టం కలిగితే నవ్వగలిగిన వాడు యోగే కాదు. మనలాంటి తార్కికుల దృష్టిలో పిచ్చివాళ్ళుకూడా. అందుకనే రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, షిర్డీసాయి ఇట్లాంటి మహానుభావులని వారి జీవిత కాలంలో పిచ్చివారిగా భావించారు కొంతమంది తార్కికులు. వారి గొప్పతనం అర్థం చేసుకోటానికి కూడా గొప్పతనం ఉండాలి. అందుకే వివేకానందుడు మొదలైన గొప్ప శిష్యులే ఆ గురువుల్ని అర్థం చేసుకోగలిగారు.

అట్టియోగిలా జీవించడం బహుదుష్కరం. కర్మ సన్యాసం అసాధ్యం. అయినా ప్రయత్నిస్తూనే వుండాలి. ఇదంతా చెప్పాక, ఈ అధ్యాయం చివరలో తర్వాత అధ్యాయం అయిన



ధ్యానయోగానికి చిన్న పరిచయం ఇస్తాడు పరమాత్మ.

**అర్జునా! ఎవడు బాహ్యములయిన విషయ భోగాలపైనుంచి మనస్సును నెట్టివేసి కనుబొమల మధ్య నేత్రదృష్టిని నిలిపి, నాసికయందు సంచరించే ప్రాణాపానవాయువులను సమముగావించి, ఇంద్రియాలను మనస్సును బుద్ధిని నియంత్రించి, కామక్రోధ భయరహితుడై, మోక్ష కామియై ఉంటాడో వాడు నిత్యముక్తుడగు యోగి అవుతాడు. అతడు నన్ను సకల యజ్ఞ భోక్తగా, సమస్తలోక ప్రభువుగా సకల భూత ప్రాణాధారునిగా స్వార్థములేని దయామయునిగా నన్ను ప్రేమించి తత్త్వ దృష్టితో తెలుసుకుని పరమ శాంతిని పొందుతున్నాడు** అని చెప్పి మరీ ముగిస్తాడు ఈ కర్మ సన్యాస యోగాన్ని పరమాత్మ.

## 6. ధ్యాన యోగం

ఇక 6వ అధ్యాయం ధ్యానయోగం పరిశీలిద్దాం. ఈ అధ్యాయంలో పరమాత్మ యోగి అంటే ఎవడు, యోగారూఢుడు,



యోగయుక్తుడు అంటే ఎవరు? ధ్యానం ఎలా చేయాలి? యోగాభ్యాసం ఎవరికి సాధ్యంకాదు. అసలు యోగం అంటే ఏమిటి? దానివల్ల కలిగే లాభాలేమిటి? ఈ అంశాల గురించి వివరిస్తాడు. ఒకవేళ యోగ భ్రష్టత్వం చెందితే ఏమవుతుందో అనే సందేహం కూడా తీరుస్తాడు.

కర్మయోగం ఆచరణ మార్గమే ధ్యానయోగం. మనం ఎంతో గొప్ప తాపసులగూర్చి విన్నాం. వారి శక్తి గురించి విన్నాం. అయితే ఆ తపశ్శక్తి సంపన్నులందరూ కామక్రోధాలను జయించిన వారు కాకపోవటం వలన శాపాలు ఇవ్వటం తద్వారా వారి తపోశక్తి కోల్పోవటం విన్నాం. ఈ అధ్యాయంలో పరమాత్మ అదే చెప్తాడు. ఆ యోగశక్తి సాధించడం ఎంత ముఖ్యమో ఇంద్రియాలను కామక్రోధాలను జయించడం అంత ముఖ్యం అంటాడు. అదే భగవద్గీత చెప్పే గొప్ప అంశం. తన కోపమే తనశత్రువు.

**కేవలం అగ్ని కార్యం త్యజించినవాడు విహిత కర్మలను వదిలి పెట్టినవాడు సన్యాసి కానీ యోగి కానీ కాలేడు. విహిత**

**కర్మలు చేస్తూ ఫలాపేక్ష లేనివాడే నిజమైన సన్యాసి లేదా యోగి అవుతాడు. సంకల్పమే వదిలిపెట్టలేనివాడు సన్యాసి కాజాలడు. ఇక యోగారూఢుడెలా అవుతాడు. యోగారూఢుడు అంటే.... ఇంద్రియ భోగాలందు ఏమాత్రం ఆసక్తి యుండరాదు. సర్వ సంకల్పాలను త్యజించాలి, తనను తానే సంసార సాగరంనుండి ఉద్ధరించుకోగలగాలి, శీతోష్ణాలు సుఖదు:ఖాలు సమ్మాన అవమానాలనే ద్వంద్వాలనుండి విముఖత కావాలి. సచ్చిదానందమూర్తి యైన పరమాత్మ యందే మనస్సుని పరమశాంతితో స్థిరపరచాలి. ఇట్టివాడే యోగారూఢుడు. ఎందుకంటే ఎవరి ఆత్మ ఇంద్రియాలని శరీరాన్ని నియంత్రించగలదో వారి ఆత్మ వారి మిత్రుడు. అట్లు చేయలేనివానికి వాని ఆత్మే వాని శత్రువు.**

**ఇక యోగయుక్తుడు ఎలా వుంటాడంటే ..... వాని అంత:కరణము బ్రహ్మను గూర్చిన జ్ఞాన విజ్ఞానములతో తృప్తిచెంది నిర్వికార స్థితిలో ఉంటుంది. ఇంద్రియాలన్నీ అతని**



**ఆధీనంలో ఉంటాయి. బంగారమైనా మట్టి బెడ్డ అయినా అతని దృష్టిలో ఒక్కటే.అతను మంచివారిని, మిత్రులను, శత్రువులను, ఉదాసీనులను ఎటూకాని మద్యస్థులనూ బంధువులనూ చివరికి తనను ద్వేషించేవారిని కూడా సమాన బుద్ధితో చూడగలవాడు. ఆశలు లేవు, ధనార్జన అక్కరలేదు, ఏకాంతవాస ప్రియుడు, నిరంతరం ఆత్మను పరమాత్మయందే లగ్నం చేస్తాడు.**

**ఒక పరిశుభ్రమైన ప్రదేశంలో ముందు దర్భాసనం ఆపై మృగచర్మం ఆపై శుభ్రమైన వస్త్రం పరచి ఒక సమున్నతమైన ఆసనము ఏర్పాటు చేసుకుని దానిపై కూర్చుని ఇంద్రియాల చేష్టలను వశపరచుకుని మనస్సును ఏకాగ్రతతో నిల్పి, శరీరము, శిరస్సు, మెడ సమానంగా కదలకుండా నిలిపి స్థిరత్వంతో తన దృష్టిని నాశికాగ్రంపై నిలిపి యితర దిక్కులు చూడకుండా, బ్రహ్మచర్యము పాటించుచూ భయక్లేశములను వదలి శాంతచిత్తుడై జాగ్రత్త కలిగి భగవంతునియందే మనస్సును నిల్పి ఆయన స్వరూపము మోక్షప్రదము అయిన శాంతి పొందుచుండవలెను.** ఇది యోగాభ్యాసమొనర్చు పద్ధతి.



భగవానుడు చెప్తున్నాడు **ఆ యోగి మితాహారి అయి ఉండాలి. అలాగని పస్తులుండరాదు. ఎక్కువ నిద్రపోరాదు. అలాగని నిద్రవదిలి శరీరాన్ని నాశనం చేసుకోరాదు. ఎందుకంటే కర్మల నాచరించాలి కదా శక్తి, శ్రద్ధ కావద్దూ? మరి ఇన్ని ఉన్నా మొత్తానికి ఉండాల్సిందేమిటంటే ఎప్పుడూ పరమాత్మయందే మనస్సు నిలపడం అన్ని సుఖములయందు వాంచ తొలగించుకొనడం.**

భగవద్గీతలో ఒక విషయమే ఎన్నోసార్లు వస్తూవుంటుంది. అదీ ఇంద్రియ నిగ్రహం, పరమాత్మయందు మన:కైంకర్యం, ద్వంద్వాల యందు సమభావం, సమస్త ప్రాణులందూ సమభావం, కామక్రోధ భయాలను విడనాడడం, పరమాత్మను పరమ గతిగా భావించడం. ఇలా ఉండాలని పదే పదే రకరకాలుగా చెప్పడం జరుగుతుంది. అందువల్ల పామరుడికిది చర్వితచరణంలాగా కనబడుతుంది. మరి భగవానుడెందుకిలా చేశాడు. అర్జునుడికి ఎందుకలా వందసార్లు ఒకేవిషయం చెప్పాడు అని ఆలోచిస్తే ఒక్కటి తడుతుంది. చెవులో



ఇల్లుకట్టుకుని పోరడం అంటే ఇదే. వందసార్లు చెప్పితే ఒక్కసారన్నా బుద్ధికి తడుతుందేమోనని.

అలాగే యోగం అంటే ఈపైన చెప్పిన వన్నీ కలిగి యుండడం అని చెప్పడమే కాకుండా ఇట్లాంటి యోగాన్ని విసుగులేకుండా నిశ్చయ పూర్వకంగా ధైర్యోత్సాహాలతో చేయాలంటాడు పరమాత్మ. క్రమక్రమంగా ఇలా అభ్యాసం చేస్తూ కోరికలని నిగ్రహించి అన్ని వైపులనుంచి ఇంద్రియాలను అణచి పరమాత్మయందే మనస్సు నిల్పితే అదే సక్రమమైన యోగాభ్యాసం అంటాడు.

మరి అలాచేస్తే మనకేమన్నా లాభం ఉండాలి కదా. లాభం లేని పనులెవడూ చేయడుకదా.

**అలా చేసిన యోగి పాపరహితుడవుతాడు. అనంతానందాన్ని అనుభవిస్తాడు. బ్రహ్మలో ఏకమవుతాడు. అట్టి మహాత్ముడు ప్రతిజీవిలోనూ పరమాత్మనూ, పరమాత్మలో అన్ని జీవులనూ చూడగలుగుతాడు. మరి అటువంటివాడికి**

నేనెప్పుడూ వాడి ఎదురుగా వాడిలోనే ఉంటాను. వాడుకూడా నా ఎదురుగా నాలోనే ఉంటాడు వాడు పైకి ప్రపంచ వ్యవహారాలలో ఉన్నట్లు కనిపించినా నిజానికి వాడికి ఆ కర్మల ఫలం అంటదు. పైగా వాడు నాకు అత్యంత ఇష్టుడు అంటాడు పరమాత్మ. ఇక అంతకన్నా ఏంలాభం కావాలి?

ఇంత చెప్పిన తర్వాత అర్జునుడికో గొప్ప సందేహం వచ్చింది. ఓ కృష్ణా మనో నిగ్రహం అని అంటావు కదా ఈ మనస్సు అతి చంచలమైనదీ ధృఢమై మొండిదీ అయివుండి. గాలినెలా అదుపుచేయలేమో అలాగే అదుపులో పెట్టలేనిది కదా మరి యోగం ఎలా సాధ్యం అంటాడు.

అప్పుడు భగవానుడే ఒప్పుకుంటాడు. నిస్సందేహంగా మనస్సు చంచలమైంది (మనభాషలో కోతిలాంటిది) అయితే అభ్యాసం వల్ల, వైరాగ్యం వల్ల దానిని వశపరచుకోవచ్చు. అలా చేయగలిగితేనే యోగప్రాప్తి కలుగుతుంది. "Practice makes it Perfect" అందుకనే ఒకరోజు యోగాభ్యాసం చేస్తే భగవంతుడు ప్రత్యక్షం కానిదీ, యోగి లక్షణాలు రానిదీను.



అప్పుడు అర్జునుడికి ఇంకో సందేహం కలిగింది. ఓ కృష్ణా కష్టపడి నీవు చెప్పినట్లు కొన్ని సంవత్సరాలు ఒకయోగి యోగాభ్యాసం చేశాడనుకో. కానీ ఒకసారి తప్పుచేసి భ్రష్టుడవుతాడా గాలికి మేఘాలు చెదిరిపోయినట్లు దిక్కులేనివాడవుతాడా అని అడుగుతాడు.

నిజానికి ఈ సందేహం మనలాంటి వాళ్ళకి తప్పకుండా వస్తుంది. అరే అదిపోయే ఇదిపోయె వ్రతం చెడ్డా ఫలితం దక్కాలి కదా మనలాంటివాళ్ళకు. ఆ సంగతి పరమాత్మకు తెలియదూ? అందుకే పరమాత్మ ఇలా బుజ్జగించి మరీ అన్నాడు. నాయనా భగవన్నామ స్మరణ చేసిన వాడికి ఎన్నడూ అన్యాయం జరుగదు. మరి యోగులకు జరుగుతుందా. వాడు దుర్గతిని పొందడు. కాకపోతే యోగభ్రష్టుడయినవాడు చనిపోయాక ఉత్తమ లోకాలలో చాలా సంవత్సరాలుండి మళ్ళీ శ్రీమంతుల ఇంట్లో దైవ భక్తుల ఇంట్లో, జ్ఞానుల ఇంట్లో జన్మించి మరల ఆ జన్మలో ఇంకా ఎక్కువ కృషితో జన్మతో వచ్చిన సంస్కారంతో భగవత్ప్రాప్తికి కృషి చేస్తాడు. జన్మత: శ్రీమంతుడయినా బాల్యంనుంచి నాయందు ఆకర్షితుడై యోగ జిజ్ఞాసుడై మోక్షం పొందుతాడు.



అలా చేసిన యోగికూడా ఎంతోమంది తపస్సంపన్నులకంటే శ్రేష్ఠుడు, శాస్త్ర జ్ఞాన పండితులకంటే ఉత్తముడుగా ప్రసిద్ధికెక్కుతాడు. కోర్కెలతో యోగమాచరించే ఎంతోమంది అల్పులకంటె అతను ఉత్తముడు. కాబట్టి అటువంటి గుణాలుండే ఓ అర్జునా నువ్వు కూడా అట్లాంటి యోగివి కావలసింది. అట్లాంటి యోగి నా దృష్టిలో పరమశ్రేష్ఠుడు పరమప్రియుడు అని ఈ అధ్యాయం ముగిస్తాడు పరమాత్మ.

## 7. విజ్ఞాన యోగం

ఇక 7వ అధ్యాయం విజ్ఞాన యోగం గురించి తెలుసుకుందాం.

విజ్ఞానమనగా భగవంతుని గూర్చి తెలియవలసిన నిశితమైన తార్కికమైన తాత్త్వికమైన జ్ఞానము.

పరమాత్మ అర్జునుడి భక్తి శ్రద్ధలకు ముగ్ధుడై ఈ విజ్ఞాన బోధన చేస్తున్నాడు. దీనిని తెలిసిన తర్వాత ఇంకా



తెలుసుకోవాల్సిందేమీ లేదు అంటాడు పరమాత్మ. వేలాదిమంది మనుష్యుల్లో ఎవడో ఒక్కడే పరమాత్మకై ప్రయత్నిస్తుంటే వాళ్ళలోకూడా ఎవడో ఒక్కడే తత్త్వదృష్టితో ఈ విజ్ఞానం తెలుసుకోగలుగుతున్నాడు.

పరమాత్మ ఇలా అన్నాడు. ఓ అర్జునా నాకు రెండు ప్రకృతులున్నాయి. ఒకటి జడ ప్రకృతి, ఒకటి పరా ప్రకృతి (చేతనా ప్రకృతి). మొదటిది ఎనిమిది విధాలుగా విభజించబడింది. భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశము (పంచభూతాలు) మనస్సు, బుద్ధి, అహంకారము (మనిషికి కలిగే వికారాలు) ఈ ఎనిమిది గల జడ ప్రకృతికంటే పరాప్రకృతి జీవరూపమైనది, శ్రేష్ఠమయినది. సకల జగతికి మూలము ప్రభవము నాశన కారణము కూడా ఆ పరమాత్మయే. ఈ జగతి అంతా దారములో గుచ్చబడిన మణులలా ఆయనకి అలంకారం. అందుకే ఆయనకన్నా పరమ కారణం ఇంకేమీ లేదు.

ఓ అర్జునా! జలములోని రసమును, సూర్యచంద్రుల

**వెలుగును, వేదాలలోని ఓంకారమును, ఆకాశంలో శబ్దం (మేఘ గర్జనలు), పురుషులలోని పురుషత్వము, భూమిలోని సుగంధము, అగ్నిలోని తేజము, సర్వప్రాణుల యందలి జీవము, తపోధనులయందలి తపస్సును కూడా నేనే. తేజోనిధుల తేజస్సు, బుద్ధిమంతుల బుద్ధికూడా నేనే. బలవంతులలో నిష్కామ నిరాసక్తమయిన బలమును నేనే.** ఆ విధంగా ఆ పరమాత్మ తన ప్రకృతిని వర్ణిస్తున్నాడు.

ఇంకొక విషయం పదే పదే భగవద్గీతలో వస్తుంటుంది. అదే త్రిగుణాత్మకమైన భావములు, కర్మలు, యజ్ఞములు, దానములు గురించిన చర్చ. ప్రతిసారీ మనం తెలుసుకోవాల్సినది మూడు గుణాలలో (సాత్విక, రాజస, తామస గుణాలు) సాత్త్వికము ఉత్తమము, రాజసము మధ్యమము, తామసము అధమము అని జ్ఞప్తి యుంటే మిగతా అంతా చాలా తేలిక. సాత్త్విక కర్మ అంటే ఏది మంచిదో, విహితమైనదో అది. సకామంగా పరూటోపంతో చేసేది. తామస కర్మ దుర్మార్గులకోసం నిర్దేశించింది (అంటే వాళ్ళు చేసేది).



నిర్దేశించింది అంటే అర్థం దాన్నికూడా ఆ తామసులకి వారి కర్మకొద్దీ ఇచ్చింది ఆ పరమాత్మే.

అట్లా ఎవరిది వారి కిచ్చినా ఆయన త్రిగుణాతీతుడు. అవినాశి. ఇది తెలిసినవారే సంసార సాగరాన్ని తరించగలరు.

పరమాత్మ ఇలా అంటున్నాడు. **భూత, వర్తమాన, భవిష్యాత్కాలాల్లో ఉన్న అన్ని ప్రాణులను నేనెరుంగుదును. కానీ నామీద శ్రద్ధ భక్తిలేని వారు నన్ను తెలిసికొన లేరు. నన్ను పొందలేనివారు కోరికలు ద్వేషాలవల్ల కలిగే సుఖ దు:ఖాలతో గుడ్డివారిలా అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్నారు.**

**నన్ను పొందాలంటే నిష్కామ భావంతో ఉత్తమ కర్మలు చేయాలి. రాగద్వేషాలు వీడి నన్ను అన్ని విధములా పరమగతిగా భావించి భజించాలి. నాకు శరణాగతులవాలి.**

సరే అట్లా అవుతాం. అప్పుడు మాకేం లాభం. మళ్ళీ మొదటికే వచ్చాం కదా. పరమాత్మ ఇలా అంటున్నాడు. ఉంది ఒక లాభం. **వారు ద్వంద్వ రూపమైన మోహమును వీడి జన్మరాహిత్యం పొందగలుగుతారు.**



**అంత్యకాలమున కూడా ఎవరైతే అధిభూత, అధిదైవ, అధియజ్ఞమైన నా ఆత్మరూపాన్ని గ్రహించటానికి ప్రయత్నిస్తారో వారు తప్పక నన్ను చేరగలరు. అంటే మోక్షమందగలరు.**

ఇలా విజ్ఞాన యోగాన్ని ముగించాడు పరమాత్మ. మనం అంత చేయలేం కాబట్టి ఆయన నామ ధ్యానమన్నా చేస్తూ అలవాటుచేసుకుంటే ఆ ధ్యానంతోనే అదృష్టవశాత్తూ మరణిస్తే ఆయన్ని చేరి మోక్షమొందవచ్చును అని అర్థంచేసుకోవాలి. జరామరణాలు సుఖదు:ఖాలు భయరోగాలూ తప్పవు. అవి పురాకృత కర్మ ఫలాలు. ఈ జన్మలో ఆత్మహత్య ద్వారా తప్పించుకోవాలనుకున్నా వచ్చే జన్మకి మళ్ళీ జమ అయ్యే అక్కౌంట్లు, వాటిని తప్పించుకోవటం ఎవరివల్లాకాదు. ఏ దేవతని ఆరాధించినా దొరికేఫలం పూర్వజన్మఫలమే. ఒక జన్మలో సుఖం ఒక జన్మలో దు:ఖం. ఈ గొడవ బదులు జన్మరాహిత్యం కోసం ప్రయత్నిస్తే అని ఎవరైనా తెలుసుకుంటే వాడే జ్ఞాని. లేదా విజ్ఞానం తెలిసిన యోగి.

మనం ఏంకాబోతామో మన చేతుల్లోనే వుంది.



చెప్పటమే నాధర్మం వినకపోతే నీ ఖర్మం అని భగవంతుడే అంటాడు చివర్లో ఆఖరి అధ్యాయంలో అర్జునుడితో నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి అంటాడు. అది మనకీ అన్వయిస్తుంది మరి.

## 8. అక్షర పరబ్రహ్మ యోగం

ఇక 8వ అధ్యాయం అక్షర పరబ్రహ్మయోగం గురించి తెలుసుకుందాం. అర్జునుడికి కొన్ని సందేహాలు వచ్చాయి. విజ్ఞానయోగం ముగిస్తూ పరమాత్మ ఈవిధంగా అన్నాడు.

**అంత్యకాలమున ఎవరు అధిభూతం, అధిదైవమూ అధియజ్ఞమూ సహితుడై ఆత్మరూపియగు నన్ను తలచెదరో వారు మోక్షమొందుచున్నారు.** అర్జునుడి సందేహం ఏమిటంటే అసలు బ్రహ్మమంటే ఏమిటి? ఆధ్యాత్మమంటే ఏమిటి? కర్మ అంటే ఏమిటి? అధిభూతం ఎవరు?అధియజ్ఞము ఏమిటి? అది శరీరంలో ఎట్లా ఉంటుంది? అసలు అంత్యకాలమున యోగపురుషులకి మీరు ఎలా గుర్తుకు వస్తారు? ఇలా ఒకదానిమీద ఒకటి సందేహాలు వెలిబుచ్చాడు. అక్షరమంటే క్షరము (అనగా నాశనము) లేని పరబ్రహ్మము అని అర్థం.

ఈ అధ్యాయంలో పరమాత్మ పైన చెప్పిన అర్జునుడి సందేహాలన్నీ తీరుస్తాడు భగవానుడు. బ్రహ్మయొక్క కాలచక్రం గురించి మనిషి యొక్క జనన మరణాల గురించి చెప్తాడు. తన అక్షర తత్త్వం గురించి చెప్తాడు. యోగులు జన్మలెప్పుడు పొందుతారు. జన్మరాహిత్యం ఎప్పుడు పొందుతారు చెప్తాడు.

పరమాత్మ ఇలా అంటాడు, బ్రహ్మమనగా అక్షరమయిన పరమాత్మ. జీవాత్మ, పరమాత్మల తత్త్వము తెలిసికొనుటయే అధ్యాత్మము. ఏ కార్యము వల్ల ప్రాణికోటి జన్మించి పెరుగుచున్నవో ఆ యుక్తమైన కార్యమే కర్మ అందురు. ఈ పురుషుడు అధిదైవమని అంటారు. ఇకపోతే ఈ దేహములో లీనమై యుండె సర్వాంతర్యామినైన నేనే అధియజ్ఞుడను.

అంత్యకాలమున ఎవరు నన్ను స్మరిస్తూ ప్రాణం వదులుతారో వారు నన్ను తప్పక చేరుకుంటారు. అప్పుడు ఎవరు ఏ భావంతో దేహం వదిలితే ఆ భావమునే పొందుతారు. అందుచేతనే నిరంతరము నన్నే స్మరించు. యుద్ధము చేయుము. నీ మనస్సున నేనే నిండియుండిన తప్పక పరమ



ప్రకాశరూపియగు దివ్యపురుషుడైన నన్నే చేరుకొనెదవు.

అర్జునా! నీవు చెప్పినట్లు ఒక్కసారిగా అంత్య సమయమున భగవధ్యానము సాధ్యముకానందు వల్ల నిత్యమూ ఇతర విషయాలపై మనసుంచక దైవ ధ్యానముతో గడుపుచుండిన మాత్రమే అది సాధ్యమగును. అక్షరమైన ఆ పరబ్రహ్మపదమందు కలుగును. అయితే యోగ పుంగవులు అది ఎలా సాధిస్తారంటే వారు ఇంద్రియాలన్నిటినీ నిగ్రహించి, మనస్సుని ఏకాగ్రతతో ఉంచి, ప్రాణాలను కనుబొమ్మలమధ్య చక్కగా నిలిపి, యోగ సాధనచేస్తూ బ్రహ్మరూపమైన ఓంకారమునుచ్ఛరిస్తూ నిర్గుణ బ్రహ్మనయిన నన్ను తలుస్తూ ప్రాణము వదులుతారు. ఆ యోగి నన్ను తప్పక చేరును. ఇందు అణుమాత్రము సందియము లేదు. ఇక వారికి జన్మలుండవు.

మరణించినవారు బ్రహ్మలోకము దాకా ఉన్న ఏలోకాన్ని చేరినా అక్కడ కర్మఫలమనుభవించి తిరిగి జన్మించు వారే. నాలోకము చేరిన వారికి మాత్రమే జన్మలేదు.



బ్రహ్మకి ఒక పగలు మానవులకు వేయి చతుర్యుగాలు (కృత,త్రేతా,ద్వాపర,కలి యుగముల కాలము చతుర్యుగము) అట్లే రాత్రి ఒక వేయి చతుర్యుగాలు. పగటియందు బ్రహ్మ సృష్టి చేస్తూ ఉండగా అవ్యక్తమైన ప్రకృతినుంచి ప్రాణికోటి పుట్టుతున్నది. రాత్రి అదే ప్రకృతి యందు ప్రళయమున నశిస్తున్నది. ఇట్లా జీవులన్నీ నశించి మరల మరల పుడుతున్నవి. ఇటువంటి జీవన్మరణ చక్రంలో అక్షరములుంది ఒక్క పరబ్రహ్మ అయిన పరమాత్మ మాత్రమే. అట్టి నన్ను చేరిన వారికి మరు జన్మలేదు. మరి నన్ను చేరే ఎన్నో మార్గాల్లో తేలికైన మార్గం కేవలం భక్తిమార్గమే.

ఇక యోగులు ఎట్టి పరిస్థితుల్లో మరణిస్తే జన్మ పొందునో ఎట్టి పరిస్థితుల్లో జన్మనొందడో చెప్తాను విను. శుక్ల, కృష్ణ మార్గములని రెండు మార్గములు గలవు. వాటినే దేవయాన, పితృయాన మార్గములందురు. అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణపు ఆరునెలలు వీటికి అధిదేవతల ద్వారా తీసుకుపోబడిన యోగులు దేవయాన మార్గము ద్వారా



ప్రయాణించి తిరిగి జన్మనొందని బ్రహ్మమును పొందెదరు. అట్లే కటిక రాత్రి, పొగ, కృష్ణపక్షము, దక్షిణాయనపు ఆరు నెలలు వీటికధిదేవతల ద్వారా తీసుకుపోబడిన యోగులు పితృయాన మార్గన ప్రయాణించి వారికి నిర్దేశింపబడిన లోకమున కర్మఫలమనుభవించి తిరిగి జన్మనొందెదరు. ఇది తెలిసిన యోగి మోహమొందక నన్ను చేరుటకే కృషి చేయును. నీవునూ అట్లే చేయుము.

కనుక యోగులు వేద పఠనము, యజ్ఞము, దానము మొదలగు సత్కర్మల పుణ్య ఫలమును అధిగమించిన మీదట నా నిలయమైన పరమ పదమును పొందుచున్నారు.

## 9. రాజవిద్య రాజగుహ్య యోగం

ఇక 9వ అధ్యాయం : రాజవిద్య రాజగుహ్య యోగం గురించి తెలుసుకుందాం. ఈ అధ్యాయం ఎంతో కష్టంగా అనిపిస్తుంది. ఒక విషయానికి రెండో విషయానికి ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. చెప్పిన విషయమే మళ్ళీ చెప్పటం జరుగుతుంది. భగవంతుడు ఎవరిమీద నాకు ప్రేమ లేదంటాడు.

మళ్ళీ ఆ భక్తులంతా నావాళ్ళే అంటాడు. ఎంత పాపకర్మలు చేసినా వాళ్ళు నన్ను పూజిస్తే సజ్జనులకిందే లెక్క అని మరీ తెగేసి చెప్తాడు. ప్రాణులందరూ తనలోనే ఉన్నాయంటాడు. ఒకసారి లేదంటాడు. ఈ విధంగా ఉన్నందువల్ల మనకి కొద్దిగా అర్థంచేసుకోవటం కష్టం అవుతుంది.

అందుకనే ఒక సూక్ష్మమార్గం కూడా చెప్తాడు తనని సంతోష పెట్టడం ఎలాగో చెప్తాడు. మరి మనం మొదటినుంచి చూద్దాం. భగవానుని గూర్చి తెలిపే విద్యే విద్య అని ప్రహ్లాదుడు అన్నాడు. అదియె విద్యలలోకెల్ల రాజు అనగా రాజవిద్య. ఆయన తత్త్వం, ఆయన్ని పొందటం ఎలా? అసలీ సృష్టి స్థితిలయలు ఆయన ఎలా చేస్తున్నాడు? జననాలూ, మరణాలూ ఎలా ఇస్తున్నాడు? ఈ రహస్యాలన్నీ చాలా గొప్ప రహస్యాలు అంటే రాజగుహ్యాలు. వీటి గురించి చెప్పే అధ్యాయం. కాబట్టి ఆ పేరు వచ్చింది.

అధ్యాయం ఆరంభిస్తూ భగవానుడు **సంసారబంధ విముక్తి కలుగ చేసే నా గురించి నేర్చే విద్య నా తత్త్వం తెలిపే రహస్యం.**



వీటిని తెలుసుకున్నాక ఈ సంసార చక్రంలో మనుష్యులు చిక్కుకొనరు. విశ్వమంతా నేనే వ్యాపించి ఉన్నందువల్ల ప్రాణికోటి అంతా నాలో ఉన్నట్లు కన్పించినా అదంతా నా యోగమాయ. నిజానికి నిరాకారుడనైన నాలో ఏ జీవమూ ఉండదు. నేనుకూడా యోగశక్తిచే జీవులలో ఉండి వాటిని సృష్టించి పెంచి నాశనముకూడా చేసే సర్వశక్తిమయుడనయికూడా వానియందు నిజమునకుండను. ఆకాశములో వాయువు నిండి యున్ననూ కన్పించదు. అలాగే సర్వభూతములలో నేను ఉన్నా ప్రళయకాలమున నా ప్రకృతిచేత నేనే నాశనము చేస్తుంటాను. మళ్ళీ సృష్టికాలమున పుట్టించుచుతాను. ఇదంతా నా చెప్పుచేతల్లో ఉండే ప్రకృతే నిర్వహించుకుంటూ పోతుంది. నేను మాత్రం నిరాసక్తుడను. వారి కర్మల కొద్దీ వారికి జన్మలొస్తాయి కానీ నాకు మాత్రం వారిపై ద్వేషానురాగాలు లేవు. వారి కర్మలకి కూడా నేను కర్తను కాను.

అయితే మూర్ఖులు నేను ద్వేషానురాగాలు గల సామాన్య మానవునిగ నా అవతార తత్త్వం తెలియక భావించి వివేకం



కోల్పోయి రాక్షస గుణాపేక్షులయి కాంక్షలతోనే నశిస్తున్నారు. సాత్త్వికులు మాత్రం అక్షరమైన నన్ను తెలిసి నిత్యం నన్ను కొలుస్తున్నారు. అదికూడా ఎన్నోరకాలుగా. కొంతమంది అనన్యమైన భక్తితో నన్ను భజిస్తున్నారు. కొంతమంది జ్ఞానయజ్ఞంతో నన్ను విశ్వరూపినని సేవిస్తున్నారు. కొంతమంది పరబ్రహ్మ ఒకటేనని నన్ను కొలుస్తున్నారు. కొంతమంది వారి ఆత్మ, పరమాత్మనయిన నేనూ వేరని భావిస్తూ కొలుస్తున్నారు. కొంతమంది సహస్ర రూపాలుకల వేల్పు అని వేదాల ద్వారా తెలిసికొని శతకోటి విధముల భక్తితో కొలుస్తున్నారు.

ఎందుచేతనంటే నేనే యజ్ఞమును, పితృదేవతలకొసగే పిండమును, ఔషధమును, మంత్రమును అగ్నిని ఆజ్యమును తల్లి, తండ్రి, తాత, గురువు అన్నీ నేనే. ఓంకారమును వేద్యుడను వేదరూపమును నేనే. సృష్టి స్థితి లయకారకుడను నేనే శీతోష్ణాలకు, వర్షమునకు కారణమును ఆఖరికి మృత్యుదేవతను కూడా నేనే సత్తు అసత్తు కూడా నేనే. అందుకనే నన్ను ఏరీతిగా కొలిచినా తేడాలేదు.



అలాకాక కేవలం స్వర్గ సుఖాలు కోరి యజ్ఞ కర్మలు చేసేవారు చనిపోయి స్వర్గంచేరి ఆ సుఖాలు అనుభవించాక మిగిలిన వారి పాపపుణ్యాల కొద్దీ జన్మనొందుతారు.

అయితే ఒక్కటి మాత్రం నిజం. ఎవరు నిశ్చలమైన మనస్సుతో నన్నే శరణంటారో నన్ను సేవిస్తారో వారి భారం నేనే వహిస్తాను. వారి మంచి చెడ్డలు నేనే చూసుకుంటాను.

వాళ్ళు అజ్ఞానంతో ఇంకే ఇతర దేవతలను కొల్చినా చివరికి నన్ను పూజించినట్లే భావిస్తాను. ఏ యజ్ఞానికైనా నేనే భోక్తను, ఏ పూజకైనా నేనే స్వీకరించు అర్హుడను. అది తెలియకే మూర్ఖులు అన్య దేవతలను కొల్చి క్షణికములైన కోర్కెలు పొందికూడా జన్మల చక్రబంధంలో చిక్కుకు పోతున్నారు. ఎందుకంటే దేవతల్ని సేవిస్తే దేవతల్నే పొందుతారు. పితృదేవతలని కొలిస్తే వారినే పొందుతారు. కానీ నన్ను పొందాలంటే మాత్రం కేవలం నన్నే పూజించవలెను. అట్టివారికి మాత్రమే పునర్జన్మ ఉండదు.

అలాగని నన్ను పూజించటం ఏమీకష్టం కాదు. నేను

చాలా అల్పసంతోషిని. పత్రం, ఫలం, పుష్పం తోయం(నీరు) వీటిలో ఏమిచ్చినా సంతోషంగా స్వీకరిస్తాను. కేవలం భక్తి ప్రధానం. అదికూడా చేతకాకపోతే నీ కర్మఫలాన్ని, నీవు తినే భోజనాన్ని, నీవు చేసే హోమాన్ని తపస్సును, ఏ పుణ్యకార్యమైనా సరే నాకు అర్పణ చేసి కృష్ణార్పణం అను. అది చాలునాకు. నేను సంతుష్టినై నిన్ను భక్తునిగా స్వీకరించి నీ మంచి చెడ్డలు నేను చూసుకుంటాను, అంటాడు పరమాత్మ.

ఆహా! ఎంత సింపుల్. అందుకనే మనం ఏ ముష్టివానికి దానం చేసినా కృష్ణార్పణం అని చేయాలి. అలా చేస్తే లాభం ఏమిటి? ఒకటే లాభం కష్టసుఖాలకాలవాలమైన కర్మబంధం నుంచి విముక్తుడవుతావు. అంత్యమున నన్ను చేరుకుంటావు. ఒక్కసారి చేస్తేకాదు. జీవితాంతం చేయాలి. ఇంకో రాజ రహస్యం చెబుతున్నాడు భగవానుడు, నాకు అన్ని ప్రాణులూ సమానమే. శత్రువు లేడు, స్నేహితుడు లేడు, కానీ నేను నా భక్తులలో ఉంటాను. వారు నాలో ఉంటారు. విరుద్ధంగా తోచే దీనినర్థంచేసుకోవటం కష్టమే. నాకర్థమయినదేమంటే ఇక్కడ



పరమాత్మ వేరు ఆయన తత్త్వం వేరు. ఆయన తత్త్వానికి అంతా సమానమే. కానీ ఆయనకి మాత్రం భక్తులయందే ప్రీతి అని. ఇది చాలా క్లిష్టం. ఒక ఉదాహరణకు మనం కూడా మన తత్త్వానికి విరుద్ధంగా కొందరిని ఇష్టపడవచ్చు. తత్త్వానుగుణంగా అవతల వ్యక్తిపై మనకి మిత్ర శత్రు భావాలు లేకపోయినా ఆ వ్యక్తి మనపై చూపించే శ్రద్ధవల్ల ఇష్టం ఏర్పడవచ్చు. మనం ఈ రహస్యాన్ని అలాగే భావించాలి మరి.

ఎంత పాపియైనా నన్ను సేవించితే అతని సంకల్పం మంచిదవటం వల్ల సాధువు అనే భావించవలెను.

అటువంటి భక్తుడు త్వరలోనే పరమశాంతి పొందగలడని ఘంటాపథంగా చెప్పగలను అంటాడు పరమాత్మ. వైశ్యులయినా, పాపజన్ములయినా, స్త్రీలు అయినా, శూద్రులయినా, జాతి జన్మభేధాలు లేకుండా నన్ను ఆశ్రయిస్తే తప్పకుండా వారు పరమశాంతి పొందునట్లు చేయుదును. వీరికే మోక్ష ప్రాప్తి కలుగుతుంటే ఇక బ్రాహ్మణులు, రాజర్షులు మొదలయిన వారికి దొరకటంలో ఆశ్చర్యమేముంది.



కాబట్టి ఓ అర్జునా! నామీద మనస్సుని ఏకాగ్రతతో నిలిపి నాకు నమస్కరించి నన్నే శరణునొందితే చాలు అతి సులభముగా నన్ను పొంది మోక్షమొందవచ్చు.

ఈ విధంగా ఎన్నో ముఖ్యమైన రాజ రహస్యాలను చెప్పి ఈ రాజ విద్యను ముగిస్తాడు పరమాత్మ.

## 10. విభూతి యోగం

ఇక 10వ అధ్యాయం : విభూతి యోగంలో పరమాత్మ తన విభూతిని అంటే వైభవాన్ని అంటే మహిమను విశదీకరిస్తాడు. అర్జునునికి తనమీద గురుభావం ఏర్పడగానే సర్వజగద్గురువైన భగవానుడు ఓ అర్జునా! నామాటలు శ్రద్ధగా వింటున్నావు కాబట్టి నేను శుభముగల్గేలాగా మళ్ళీ నాయొక్క విభూతిని చెప్తాను విను. ఈ దేవతల్ని మహర్షుల్ని నేనేసృష్టించాను అందుకని వారలెవ్వరికినీ నాపుట్టుక ఎట్టిదో తెలియదు. జననమే లేని సర్వేశ్వరుడను నేను.

సమస్త ప్రాణులకు వారి వారి కర్మఫలము కొద్దీ జ్ఞానం,



సహనం, సత్వగుణం, నిర్మోహం నిర్మలత్వం, ఇంద్రియ నిగ్రహం, ద్వంద్వములయందు సమత్వం, దాన అహింసాది సత్త్వ గుణములు, తపస్సు, అపకీర్తి చివరికి మరణం కూడా నేనే కలుగచేస్తున్నాను. వారిలో ఉండే ఆ సహజగుణాలను వృద్ధిపరుస్తున్నది కూడా నేనే.

సనకసనందనులు, సప్త ఋషులు, మనువులు వీరందర్నీ నేను సృష్టిచేస్తే ప్రకృతి సహాయంతో వారినుంచి సమస్త జీవకోటి జన్మించింది.

నా సృష్టి మహిమ, యోగమాయ తెలిసినవారు నేనే సర్వేశ్వరుడనని భజించి సర్వస్వం అర్పించి ముక్తి పొందుతారు. వారికి నేనే ఆ సద్బుద్ధి కలుగచేస్తాను. అందుచేత వారు నా భక్తులయి జ్ఞానమార్గంతో అజ్ఞానమనే అంధకారంనుండి బయటపడి నన్ను వారి హృదయంలో ప్రతిష్ఠించుకొన గలుగుతున్నారు.

అప్పటికి అర్జునుడికి సందేహ నివృత్తి అయిందికానీ ఆ

భగవానుని గూర్చి ఇంకా తెలుసుకోవాలనే కోర్కె కలిగింది. ఓ కృష్ణా నీవే పరబ్రహ్మవు, పరంధాముడవు, విశ్వవ్యాప్తుడవు జన్మలేని ఆది మధ్యాంత రహితుడవు. ఈ సంగతి సకల ఋషులు, నారదుడు, అసితుడు, దేవలుడు వీళ్ళందరూ కాకుండా స్వయంగా నీవుకూడా చెప్తున్నావు. కాబట్టి ఇదంతా సత్యమే. నీవు నిస్సందేహంగా దేవదేవుడవే. అయితే ఓ దేవా విశ్వవ్యాప్తమయిన నీవెట్లుందువు. నిన్ను తెలియుటెట్లు. ఏ భావమున నిన్ను ధ్యానించవలెను. నీ పూర్తి విభూతి ఎటువంటిది. నీయోగమహిమ, లీల ఎటువంటివి. నాకు తృప్తి తీరా చెప్పి ధన్యుణ్ణి చెయ్యి అంటాడు.

దానికి భగవానుడిలా అన్నాడు. ఓ అర్జునా నాపూర్తి విభూతి అంతు లేనిది. నీ కోసమని క్లుప్తంగా ముఖ్యమైనదే చెప్తాను వినుము.

నేను సర్వవ్యాప్తుడను, సర్వ జీవాధిపతిని. అన్ని జీవులలో ఉండే ఆత్మని, వాటి సృష్టి స్థితిలయలకు కారణుడను నేనే. ఇక నేనెందెందు ఉంటినో వినుము.



ఆదిత్యులందు విష్ణువును, ప్రకాశమిచ్చే జ్యోతులందు సూర్యుడను, మరుత్తులందు మరీచిని, నక్షత్రములందు చంద్రుడను, వేదములందు సామవేదమును, దేవతలయందు ఇంద్రుడను, ఇంద్రియములందు మనసును అంతెందుకు ప్రాణులందుండు చేతనంబును కూడా నేనే. రుద్రులందు శంకరుడను, యక్షులందు కుచేరుడను, అష్టవసువులందు అగ్నిని, పర్వతములలో మేరు పర్వతమును, పురోహితులందు బృహస్పతిని, దండన నొనంగువారి దండనీతిని, రాజులయందలి రాజనీతిని, రహస్యములయందు మౌనమును, జ్ఞానులయందు జ్ఞానమును నేనే. సేనాపతులందు కుమారస్వామిని, జలరాసులందు మహాసముద్రమును, బ్రహ్మ ఋషులందు భృగు మహర్షిని నేనే.

శబ్దములందు ఓంకారమును, యజ్ఞములయందు జపయజ్ఞమును, స్థావరములందు హిమవంతమును, వృక్షములలో రావిచెట్టును, దేవఋషులందు నారదుడను, గంధర్వుల యందు చిత్రరథుడను, సిద్ధులందు కపిలమును



కూడా నేనే. అశ్వములయందు ఉచ్చైశ్రవమును, గజములయందు ఐరావతమును, మానవులయందు వారిని పాలించే రాజును, ఆయుధములయందు వజ్రాయుధమును, గోవులయందు కామధేనువును, మోహజనితుల యందు మన్మథుడను సర్పములయందు వాసుకిని నేనే.

మరియు నాగులయందు శేషుడను జలదేవతలయందు వరుణుడను, పితృదేవతలయందు ఆర్యముడను, శిక్ష విధించు వారలయందు యమధర్మరాజుని కూడా నేనే.

రాక్షసులయందు ప్రహ్లాదుడను, కాలము నిర్ణయించు కాలుడను. మృగములందు సింహమును, పక్షులయందు గరుత్మంతుడను నేనే. మాలిన్యనిర్మూలనము చేయగలుగు గాలిని నేనే. శస్త్రధారులందు శ్రీరాముడను, నదులలో గంగానదిని, జలచరములలో మొసలిని నేనే. ఇట్లా సృష్టియందు నా అంశలేని దేదియూ లేదు. సృష్టికి ఆది మధ్య అంతమునూ నేనే. ఇక విద్యలయందు ఆధ్యాత్మ విద్యను, వాదించు వారి వాదపటిమను, సమాసములందు ద్వంద్వ సమాసమును, అక్షరములయందు



అ కారమును, నాశనములేని కాలమును, చతుర్ముఖ బ్రహ్మను కూడా నేనే. సంపాదించే వారి ఐశ్వర్యమును, నశింపచేయువారిలో మరణమును, స్త్రీలయందలి కీర్తి, సిరి, వాక్కు, మేథస్సు, జ్ఞాపకశక్తి ఓర్పు ధైర్యగుణము అన్నియూ నేనే.

సామవేదమందు బృహత్ సామవేదమును, ఛందములందు గాయత్రిని మాసములందు మార్గశిర మాసమును, ఋతువులందు వసంత ఋతువును నేనే.

చివరకు దుర్మార్గులయిన మోసకారులందు కూడా వారి మోసమును నేనే, తేజస్వులందుండు తేజస్సును, విజయ సాధకులందలి విజయ కాంక్షను, కృషీవలులందరి కృషిని, బలవంతులయందలి బలమును, యాదవులయందు వాసుదేవుడను. అంతెందుకు పాండవులయందు నీవే అయిన అర్జునుడనూ నేనే, ముని పుంగవులలో వ్యాసుడను, సూక్ష్మబుద్ధులలో శుక్రాచార్యుడను నేనే.

ఈ విధముగా సమస్త ప్రాణులయందు నేనున్నాను. వాటిమూల కారణమును నేనే సుమా. నేను లేని వస్తువేదీ ఈ

**సృష్టిలో లేదు. నీ మీద అవ్యాజమైన ప్రేమ, స్నేహముతో నీకు వివరించి నాయీ విభూతిని చెప్పాను. నిజమునకు దానికి అంతము లేదు.**

**ఐశ్వర్య శోభలతో ఒప్పే ఏదైనా నాతేజస్సులోని ఒక చిన్న అంశమువల్లనే అదిట్లా శోభిల్లుతున్నదని గ్రహించుము. అయితే నా విభూతి వివరములు తెలిసినంత మాత్రమున నీకు ప్రయోజనము లేదు. ఒక్కటి అర్థం చేసుకుంటే చాలు. ఈ జగతి అంతా నాయొక్క ఒక అంశతోనే నిండి సంచరిస్తోంది.నేను లేనిచో అది శవమేగానీ ప్రాణికాదు. కావున జీవాధారము నేనే.**

ఇదీ భగవానుడు అర్జునునికి చెప్పిన విభూతి యోగం. ఆయన సర్వాంతర్యామి అన్నది అందుకే. కాకపోతే అది తెలిసినవారు యోగులు మాత్రమే. మనబోటివాళ్ళు చదివి ఓహో అట్లాగా అనుకుంటాం కానీ నిజానికి అది పుస్తకాల జ్ఞానం. స్వానుభవం కానందువల్ల మనం యోగులం కాలేము. స్వానుభవం కావాలంటే భగవానుడిదివరకు తొమ్మిది



అధ్యాయాల్లో చెప్పినట్లు చేయాలి. స్థితప్రజ్ఞుడు కావాలి. యోగయుక్తుడు కావాలి, కర్మయోగి అయినా సాంఖ్యయోగి అయినా కావాలి. పరమాత్మ యందు పరిపూర్ణమైన విశ్వాసం కలిగి యుండాలి. ఆపదమొక్కులు కోరుకునే మనలాంటి వాళ్ళకది అసాధ్యం. అందుకనే కలియుగంలో మనలాంటి వాళ్ళకోసమే ఆపదమొక్కులవాడిలాగా అసలుసిసలు వడ్డీవ్యాపారిలాగా అయి వడ్డీకాసుల వెంకటేశ్వరుడయినాడు ఆ భగవానుడు. ఇచ్చి పుచ్చుకునే విధానాన్ని FOLLOW అవుతున్నాడు. ఐహిక వాంఛలు తీరుస్తాడు. మనబోటివాళ్ళు దాంతో తృప్తిపడతారు. మనలోకూడా కోటి కొక్కరైనా ఈ ఐహిక వాంఛలు వదిలివేసి ముక్తిని కోరుకుంటారు. మనబోటివాళ్ళు కేవలం అన్నీ ఉడిగి చావుకి దగ్గరయ్యాక కూడా అప్పుడప్పుడు పైపైకి కోరుకుంటాం. భగవాన్ నాకు ముక్తికావాలని. అది కేవలం విసిగిన ప్రాణం కోరే కోర్కె అని ఆయనకు తెలుసు అందుకనే ఆయనిచ్చేది కేవలం మన కర్మఫలమే. He is an ultimate distributor of results of our own "Karma Phalam".



## 11. విశ్వరూప సందర్శన యోగం

ఇక 11వ అధ్యాయం : అత్యంత ముఖ్యమూ ఆసక్తిదాయకమూ శ్రేష్ఠమూ అయిన విశ్వరూప సందర్శన యోగం. మాటలు చెప్పటం వేరు చేతలు చూపటం వేరు. ఎన్ని నీతిబోధలు చేసినా గురువు తన మహిమ చమత్కారం చూపనిదే శిష్యులు గురువు గొప్పతనాన్ని అంగీకరించలేరు.

అందుచేతనే నేటి యాంత్రిక ప్రపంచంలో కూడా మనబోటి అల్పులకు నీతిబోధలతోబాటు మహిమలు చూపుతున్నారు. సాయిబాబా, రాఘవేంద్రుల వంటి గురుదేవులు. అవి వారి గొప్పతనం చూపటానికి కాదు కేవలం మనం వారి మీద గురియుంచి సన్మార్గులమవ్వాలనే.

ఇన్ని అధ్యాయాల్లోనూ భగవానుడు ఎన్నో బోధలు చేశాడు. శిష్యుడు అర్జునునికి చివరికి తన విభూతి గురించి చెప్తూ నేనే సర్వేశ్వరుడను సర్వ వ్యాప్తుడనూ సృష్టి స్థితిలయ కారకుడనూ అన్నాడు. కానీ అర్జునుడు తృప్తి చెందలేదు. అందుకే ఇలా అన్నాడు అర్జునుడు.



**స్వామీ నాయందు దయవుంచి అతిరహస్యమైన ఈ ఆత్మ జ్ఞానాన్నిచ్చి నా అనుమానాలన్నీ తీర్చావు. నీవు చెప్పేదంతా నిజమే. కానీ విశ్వవ్యాప్తుడవయిన నీ రూపం చూడవలెనని యున్నది. అది చూచుటకు నాకు శక్యమా? అట్లని నీవు తలచిన దయయుంచి నాకా విశ్వరూపము చూపుము** అన్నాడు.

భగవానుడాతని సంశయం పూర్తిగా నివారించాలనుకున్నాడు. ఇలా అన్నాడు **అర్జునా ఎన్నో ఆకారాలతో వర్ణాలతో, విధములతో ఒప్పే నా దివ్యరూపం చూపిస్తాను. ఆదిత్యులు, అశ్వనీదేవతలు, వసువులు, మరుత్తులు ఈ చరాచర జగత్తునంతా నా దేహంలో చూడు. అయితే నీ కనులకది సాధ్యంకాదు కనుక దివ్యచక్షులనిస్తా వాటితో అతిభయంకరము, ఆశ్చర్యకరమూ అయిన నా విశ్వరూపము చూడు** అన్నాడు. అప్పుడేం జరిగిందో చూద్దాం.

సంజయుడిదంతా ధృతరాష్ట్రునికి చెప్తూనే ఉన్నాడుకదా. ఆయనన్నాడు ఓ మహారాజా కృష్ణభగవానుడు అప్పుడు

అర్జునునికి తన విశ్వరూపం చూపించాడు. అదెలా ఉందంటే.

అంతులేని ముఖాలు, నేత్రాలు, ఎక్కుపెట్టియున్న దివ్యాస్త్రాలు, దివ్యమైన పూమాలలు, వస్త్రములు, సుగంధాలతో ఆది అంతములేని అద్భుతమైనదా రూపం. వెయ్యి సూర్యుల కాంతితో దేదీప్యమానంగావుంది. ప్రపంచమంతా ఆ దేహంలో ఒక్కొక్కచోట ఒక భాగంలాగా కనబడుతుంది. అది చూచి పులకరించి, చకితుడై భీతిల్లి ఆ దేవదేవునికి తలవంచి నమస్కరించి కిరీటి ఇలా అన్నాడు.

ఓ సర్వేశ్వరా నీ దేహంలో నేను సర్వభూతాలతో నిండిన జగతినంతా చూస్తున్నాను. బ్రహ్మనూ, ఋషులను, సర్పజాతులనూ చూస్తున్నాను. ఎన్నియో ముఖములు, నేత్రములూ, భుజములూ ఉదరములతో నిండిన నీ రూపునకు ఆది మధ్యమూ అంతమూ లేవు. ఇంత దివ్యకాంతిని చూచి నాకు దిక్కుతోచకుండా ఉంది.

శిరముపై కిరీటముదాల్చి శంఖ చక్ర గధా ధారియైన



నీరూపం దిక్కులు చూడసాధ్యము కాని కాంతితో నిండిపోతున్నాయి. ఓ పరమాత్మా! నిశ్చయముగా నీవు పరబ్రహ్మవే. జగదాధారుడవే, ఓ పురాణ పురుషా ధర్మరక్షకా నీవు అనంతుడవు. ఆది మధ్యాంత రహితుడవు జ్వలియించే అగ్నితో సమానంగా ఉన్నవి నీ ముఖములు. ఆ వేడితో ఈ జగతి తపించి పోతోంది.

చూడచూడగా ముల్లోకాలు భీతితో వణికిపోయేట్లు అతి భయంకరంగా అవుతున్నది నీ రూపం. దేవతలందరూ నీలోనే చేరియున్నారు. కొంతమంది భక్తులు భయంతో చేతులోడ్చి మొక్కుతున్నారు. సిద్ధులు, ఋషులూ నిన్ను స్తోత్రం చేస్తున్నారు. ఆదిత్యులు, రుద్రులూ వసువులూ, అశ్వనీదేవతలు, రాక్షసులు, పితృ దేవతలు, సిద్ద సాధ్య గంధర్వ యక్షులందరూ కనబడుతున్నారు. అందరూ భీతితోనూ భక్తితోనూ నమస్కరిస్తున్నారు. స్వస్తి వచనాలు చెప్తున్నారు.

ఎన్నో వర్ణాలతో మండుతుండే నోళ్ళతో ఉన్న నీ రూపం చూస్తే ధైర్యం పోతోంది. భయంతో నీకోరలని చూసి



దిక్కుతోచటంలేదు. సమస్త రాజలోకం, ధార్తరాష్ట్రులూ, భీష్మ, ద్రోణ కర్ణులు భయంకరమైన నీ నోళ్ళలోకి అతివేగంగా పోతున్నారు. నీ దంతాల మధ్య నలిగిన వారి తలలు చూర్ణములై, అగ్నిని చేరు మిడతలవలె యుద్ధ ప్రముఖులు నాశనమవుతున్నారు.

ఓ మహానుభావా నీ దివ్య తేజంతో జగత్తునంతా నింపుతూ సర్వనాశన మొనరించుచున్న ఓ ఉగ్రమూర్తి నీవెవ్వరవు? నీకు నమస్కరించెదను. నా యందు జాలిగొని నీవేల ఇట్లుంటివి నీ సంకల్పమేమి తెల్పుము అని గడగడ వణుకుతూ అడిగాడు అర్జునుడు.

అప్పుడు విశ్వరూపధారి అయిన భగవానుడిలా అన్నాడు. ఓ అర్జునా నేను కాలపురుషుడను. దుష్టులగు రాజులను, మానవులను నిర్మూలించదలచిన మృత్యుదేవతను. ఇప్పుడు ఈ వినాశనము ఆగదు. నీవు యుద్ధము చేయకుండినను, ప్రజా నాశనము తప్పదు. అది నా



నిశ్చయము. ఇందు నీ ప్రమేయమేమియూ లేదు. భీష్మ,ద్రోణ, కర్ణ సహితముగా నీశత్రువులందరూ నాచే ఎన్నడో చంపబడిరి. అది నీవే చూచితివి. ఇకనీకు సందేహము, భయము ఏల. నిమిత్తమాత్రుడవయి యుద్ధముచేసి కీర్తి పొందుము.

సంజయుడిలా అన్నాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా ఆ విశ్వరూపుని మాటలు విని భయంతో వణికిపోతూ వందనమాచరించి అర్జునుడిలా అన్నాడు.

ఓ దేవా నీ మహిమ పొగుడుతూ ఈ ప్రపంచమంతా ఆనందం చెందుతోంది. నీవు అక్షరుడవు, శాశ్వతుడవు జగదాధారుడవు. బ్రహ్మకు కూడా ఆద్యుడవు. నీభక్తి వీడుట అసాధ్యము. ఓ స్వామీ! నా అజ్ఞానముచే నువ్వు మనుష్యమాత్రుడవని నా బావవని చనువుగా ఓయి యాదవా అని నిర్లక్ష్యముగా ఎన్నోమార్లు హేళన చేసితిని ఓ దేవదేవా! నా అపరాధములు మన్నింపుము. కరుణతో నన్ను కాపాడుము. ఓ జగద్పితా నీకు సమానుడే లేడన్నచో నీకన్నా అధికుడెవడు?

ఓ అనన్యా! తండ్రి కొడుకుని, స్నేహితుడు తన స్నేహితుని, ప్రియుడు ప్రియురాలినీ క్షమించి ప్రేమతో చూచునట్లు నన్ను క్షమించుము. సాష్టాంగ ప్రమాణము చేసి ప్రార్థింతును. ఓ విశ్వరూపా నా భయమూ కలతలూ అన్నీ దూరమవుతున్నవి. నామీద కరుణతో ఈ నీ విశ్వరూపమును హరించి, శంఖ చక్ర గధా ధరుడవై చతుర్భుజములతో సమ్మోహనమైన నీరూపమును చూపుము నన్ను అనుగ్రహింపుము అన్నాడు.

అప్పుడు భగవానుడిలా అన్నాడు. ఓ అర్జునా నాయీ రూపు చూడాలంటే ఎవరికైనా అసాధ్యమే. ఎన్ని వేదాలు చదివినా, యజ్ఞాలు చేసినా తపోదానాలు చేసినా ఈ రూపం చూడ సాధ్యంకాదు. భీతి చెందిన నిన్ను స్వాంతన పరచుటకై సమ్మోహనమైన నా చతుర్భుజాకారమైన రూపమును చూపింతును చూడుము. ఆ రూపం చూశాక అర్జునుడు స్వస్థతని చెందాడు. భగవానుడు ఇలా అన్నాడు.

ఓ అర్జునా ఈ నా రూపము చూచుట అతిదుర్లభము అని చెప్పితిని. నీమీద దయచే అది సాధ్యమవుతున్నది. కాబట్టి



ఓ అర్జునా ఇప్పటికైనా నన్నే పరమగతిగా భావించి కర్మల నాచరించి నిరాసక్తుడవై నన్ను శరణాగతిగా పొందుము.

## 12. భక్తి యోగం

ఇక 12వ అధ్యాయం : భక్తి యోగం గురించి తెలుసుకుందాం.

ముందు ఆత్మజ్ఞానం, కర్మయోగం, భగవానుడి విభూతి అయ్యాక అర్జునుడిని పూర్తిగా అజ్ఞానాంధకార విముక్తుడ్ని, నిజమైన భక్తుడ్ని చేయటం కోసం తన విశ్వరూప సందర్శనం చేయించాడు భగవానుడు. దాంతో అర్జునునికి తన అల్పత్వం పరమాత్ముడి విశ్వవ్యాప్తి గుణం తెలిసి భక్తుడయ్యాడు. అయితే అతను ఇంకా అహంకారం కూడుకున్న భక్తుడా అనే సంశయం భగవానునికి వచ్చిఉండాలి ఎందుకంటే ఎవరికీ సాధ్యంకాని విశ్వరూప సందర్శనం చేసిన గొప్ప ప్రియభక్తుడిని నేను అనే భావన ఉందేమో. అందుకని భక్తియోగం చెప్తున్నాడు దేవదేవుడు. భక్తుల్లో నాలుగు రకాలు ఇదివరకే చెప్పాడు. అప్పుడు కూడా



జ్ఞానే తన ప్రియ భక్తుడన్నాడు.

కానీ ఈసారి చాలా విపులంగా తనభక్తుడెలా ఉండాలో చెప్తాడు. అదికూడా అర్జునుడికే వచ్చిన సందేహం తీరుస్తూ. అర్జునుడు అడుగుతాడు ఓ స్వామీ మిమ్మల్నే శరణన్న ఆ భక్తులు గొప్పవారా? లేక నిర్వికార నిరంజనమగు ఆత్మను తెలిసికొని ఆత్మజ్ఞానులైన సిద్ధులు గొప్పవారా?

భగవానుడిలా అన్నాడు. అర్జునా ఇదివరకే చెప్పాను నన్ను పూజించటం చాలా తేలిక. నిరంతర శ్రద్ధతో సగుణ స్వరూపుడుగా నన్ను స్మరించే భక్తుడు నిశ్చయంగా ఉత్తముడే. అయితే నువ్వుచెప్పిన ఆత్మజ్ఞానోపాసకుడు కూడా తక్కువవాడేమీకాదు. అతనుకూడా ఇంద్రియ నిగ్రహంతో సర్వభూతదయతో నిర్వికారమయిన ఆత్మరూపమే సర్వవ్యాప్తమని నిశ్చయంతో ఆత్మలోనే నన్ను చూస్తూ ఆ ఆత్మ రూపాన్నే పూజిస్తాడు. అతను కూడా ఆ ఆధ్యాత్మిక భక్తివలన నన్ను పొందగలడు. కానీ ఆ మార్గం చాలా కష్టతరం. విశేష



శ్రమభరితం. సాధారణ దేహాభిమానులకు ఈ అవ్యక్త బ్రహ్మ ఉపాసన దాదాపు అసాధ్యం.

అందుచేతనే ఎవరైతే వారి సమస్త కర్మఫలాలను నాకర్పణ చేసి సాక్షి, గతి నేనేనని చిత్తశుద్ధితో భావిస్తారో వారి మనస్సులందు నేను నిలిచి వారిని మృత్యు సమానమైన సంసార సాగరమునుండి బయటపడునట్లు చేస్తాను.

దానికోసం నువ్వు చేయాల్సిందేమంటే నిలకడగా నామీద మనస్సు లగ్నంచేయి, అలా చేయలేనిచో నన్ను చేరవలెనని తపనతో ప్రయత్నించు, అదీ చేతకాకపోతే నాకిష్టమైన కర్మలు ఆచరించు. అదీచేత కాకపోతే నన్ను శరణని నీకర్మఫలము నాకు దానం చేయి. నాకదిచాలు. అవివేకంతో చేసే ఆచార నియమాలకన్నా దైవజ్ఞానం మేలు. దానికన్నా దైవధ్యానం మేలు దానికన్న మనస్సుకు పరమశాంతినిచ్చే కర్మఫలత్యాగము నిశ్చయముగా మేలు.

ఇకనాకు ఎటువంటి భక్తుడు ఇష్టుడో చెప్తాను వినుము.

**సర్వ ప్రాణులపట్ల సమ స్నేహభావము, ద్వేషరాహిత్యము, దయ కల్గియుండుట, అహంకార మమకారములను విడనాడుట, సుఖదు:ఖముల పట్ల సమభావన, ఓర్పు, సంతృప్తి యోగసాధన, చిత్తశ్శుద్ధి, మనోవాక్కాయ కర్మలా నన్ను అర్చించుట. ఈ గుణములున్న వారే నా ప్రియ భక్తులు. వారు లోకమువల్ల తమకు తమవల్ల లోకమునకు హాని జరుగకుండా శ్రద్ధ వహించి నిర్భయముగా రాగాతీతులై కోపావేశములను వశపరచుకుని నిష్కాములై దక్షులై శుచి, శుభ్రతలు కల్గి నిష్పక్షపాత బుద్ధితో నిశ్చింత మనస్కులై నిరాడంబరులై జీవిస్తారు. శుభములందు విపరీతమైన సంతోషము, అశుభములయందు దు:ఖము చెందరు. కోర్కెల నణచగలరు.**

**ఇంతియే గాక, శత్రువులయందు మిత్రులయందు సమభావన, మానావమానములందు నిస్పృహ, శీతోష్ణ సుఖదు:ఖములయందు సమభావన, ధూషణ భూషణలయందు**



**నిరాసక్తత, సర్వ ప్రాపంచిక విషయములందు విరక్తి, దొరికిన దానియందు సంతృప్తి, మౌనవ్రతంబు, స్థిర నిశ్చయము కల్గియుండు శ్రేష్ఠుడు నిశ్చయముగా ఉత్తమమైన భక్తుడు.**

**శ్రద్ధ ఓర్మి భక్తిచే నాయందు బుద్ధి నిలిపి అమృతసమమైన భక్తి భావనచే నేను చూపించు త్రోవలో నడుచువాడే నా ఉత్తమమైన భక్తుడు.** భగవానుడు ఆ విధంగా భక్తియోగం ముగించాడు.

ఒక్క కొబ్బరికాయ కొట్టి ముడుపులు కట్టి లంచం ఆశచూపి (అదయితే ఇదిస్తా అనటం) ఆడంబరంగా తీర్థయాత్రలు చేసి శతసహస్ర నామాలు పూజారితో చదివించి పూజచేయించి స్పెషల్ దర్శనాలు పొంది దేవుడి కళ్యాణం కూడా లంచంలో ఒక భాగంగా చేయించే 21వ శతాబ్దపు భక్తులు ఆ భగవానుడి ప్రియభక్తులవగలరా కారు. వారు ఆర్తులూ, అర్థార్థులు అని ఆయనే చెప్పాడు. అయితే గుర్తుంచుకోవాల్సిందేమిటంటే ఆయన వాళ్ళని కూడా కరుణిస్తాడు. కోర్కెలు తీరుస్తాడు. కాకపోతే సుఖాలనిచ్చే ఆ



కోర్కెలు చివరికి ఒకనాటికి తీరిపోయి దు:ఖం కలిగించేవిగా మారి విరక్తిని కలిగిస్తాయి. జ్ఞానం, మోక్షం కోరే వారికి మాత్రమే భగవద్గీత. డబ్బు కోరే వారికి కాదుకదా.

## 13. క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం

ఇక 13వ అధ్యాయం : క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం. అనగా క్షేత్రమంటే ఏమిటో క్షేత్రజ్ఞుడనగా ఎవరో వివరించే అధ్యాయం. విశ్వరూప సందర్శనం తర్వాత అర్జునుడు నిజమైన భక్తుడయ్యాడు. భక్తియోగం తెలిశాక అతనికి ఈ ప్రకృతి దానిని నిర్దేశించే పరమాత్మ తత్త్వాన్ని వివరించాలని భగవానునికి అనిపించి ఈ అధ్యాయంలో వివరిస్తాడు.

మొదట అర్జునుడు ఇదివరకులాగానే సందేహాలడుగుతాడు. **ఓ కృష్ణా ప్రకృతి అంటే ఏమిటి? పురుషుడెవరు? క్షేత్రమంటే ఏమిటి? క్షేత్రజ్ఞుడనగా ఎవరు? జ్ఞానం అంటే ఏమిటి? జ్ఞేయం అని దేనినంటారు? వీటిగురించి కరుణతో నాకు వివరించగలవు.**



అప్పుడు భగవానుడిలా అన్నాడు.

**ఓ అర్జునా మనిషియొక్క శరీరమే క్షేత్రము. ఈ క్షేత్రము యెక్క పూర్తి తీరును గ్రహించినవాడే క్షేత్రజ్ఞుడు అని గ్రహింపుము. అనగా శరీరమందంతా నిర్వికార నిరంజనముగ వ్యాపించియున్న జీవాత్ముడు క్షేత్రజ్ఞుడు అని తెలియుము.**

**ఆ విధముగానే ఈ చరాచర ప్రకృతిని క్షేత్రమనియు ఈ ప్రకృతిని తనచెప్పుచేతలలో ఉంచే పరబ్రహ్మమే క్షేత్రజ్ఞుడనియూ తెలియవలయును. కాబట్టి పరమజ్ఞానమనగా ఈ రహస్యము తెలియుటయే.**

మరి అటువంటి క్షేత్రజ్ఞుడి లక్షణాలు ఎలావుంటాయంటే వినుము. వేదము దాని వేత్తలయిన ఋషులు నిస్సందేహంగా క్షేత్ర క్షేత్రజ్ఞుల బేధపరచి విశదపరచుటవలన హేతుబద్ధముగా వానియొక్క విభాగము నర్థంచేసుకోవచ్చు.

భగవానుడిలా అన్నాడు.

పంచభూతములను, పంచేంద్రియములను, స్వభావ ప్రకృతి, అహము, మనసు, బుద్ధి, ఇంద్రియమ్ములు, ద్వేషము, కోర్కెలు, సుఖదు:ఖములు, శరీర భాగములు, తెలివి తేటలు, ధైర్యము, మనోవైకల్యాలు, మనోగత భావాలు మొదలైన ప్రాపంచిక విషయాలను క్షేత్రమని అనవచ్చును.

అట్లాగే ఈయొక్క క్షేత్రమును చిత్తశుద్ధితో తెలిసి తనవశమందుంచువాడే క్షేత్రజ్ఞుడు. అనగా జీవాత్మయే క్షేత్రజ్ఞుడు.

ఇకజ్ఞానమనగా ఏమియో తెలుసుకో.

స్వోత్కర్ష లేకుండుట, నిష్కపటము, అహింస, సహనము, సరళ స్వభావము, సద్గురుల యందు భక్తి సేవాతత్పరత, చిత్తశుద్ధి ఆత్మ నిగ్రహం స్థిరసంకల్పము, ఇంద్రియ నిగ్రహము నిరహంకారము, జనన మరణ రోగముల వల్ల కలుగు దు:ఖములయందు నిబద్ధమగుట ప్రాపంచిక విషయములందు



నిరాసక్తత భార్యాబిడ్డలపై నిర్వ్యామోహము వస్తు సముపార్జనపై విరక్తి కలిగియుండుట. ఇట్లుండవలెనని తెలియుటయే జ్ఞానము. అట్టి జ్ఞానమువల్ల శుభాశుభములయందు సమభావన, స్థిరమైన భగవద్భక్తి, ఏకాంతమందు ప్రీతి, ఆత్మ ధ్యానము, తత్త్వజ్ఞానమువల్ల కలుగు లాభములు గ్రహించుట జరుగును.

ఇట్టి జ్ఞానమునకు పూర్తిగా విరుద్ధమైనది అజ్ఞానము. ఇక జ్ఞేయమని దేనినంటారో చెప్తా వినుము. *జ్ఞేయమనగా తెలుసుకోదగిన పరమాత్మ అని అర్థము. అనగా బ్రహ్మమునుగూర్చి తెలిపెడి బ్రహ్మజ్ఞానము. దానిని తెలిసిన పిదప కలిగెడిది కేవలం మోక్షపథమే. పౌరాణికమైన ఆ బ్రహ్మజ్ఞానము సత్తు కానీ అసత్తు కానీ కాదని గ్రహింపుము. అదేం చెపుతుందంటే....

పరబ్రహ్మము విశ్వవ్యాప్తము. దానిచేతులు పాదములు, చెవులు, తలలు, ముఖములు ఈ జగతినంతా ఆవరించి



వున్నది. (అనగా ఎక్కడ చూసినా అదే అని అర్థము). సర్వేంద్రియములందు, సర్వగుణములయందు అది కలదు. కాని దానియందు ఏమియూ లేవు. జగతికంతకీ అదే ఆధారము. కానీ దానికాధారమేదీ లేదు. గుణాతీతమే కానీ అన్ని గుణముల గురించిన తత్త్వమది అనుభవించగలదు. సర్వ భూతములలో యున్నది. వెలుపల లోపల అంతటా ఉన్నది. అనంత రూపానా ఉన్నది, సూక్ష్మ రూపానా ఉన్నది. సుదూరంగానూ ఉన్నది అతి సమీపంగానూ ఉన్నది. అది నిరాకారము అయినా ప్రాణులన్నిటిలోనూ ఒక్కొక్క ఆకారం కలదిగా కనిపిస్తున్నది. సృష్టి స్థితి లయకారకము. ఏ జ్యోతినైనా వెలిగించకలదు. అజ్ఞానాంధకారమును నిర్మూలించగలదు. జ్ఞాన స్వరూపము కూడా అదియే ప్రతి ప్రాణి హృదయములో నిలిచి యుంటుంది.

అటువంటి బ్రహ్మమును తెలియగల భక్తులు నిస్సందేహంగా మోక్షార్హులు.

(మరియొక సంగతి తెలుసుకోవాలి. మాకు బాగా సైన్స్



తెలుసుననుకునే వాళ్ళు సృష్టి ప్రకృతి వల్ల జరుగుతుంటుంది భగవంతుడెవరు? ఈ జీవరాసులన్నీ ఏక కణ జీవులనుంచి ఉత్పత్తి అయ్యాయి. అన్నిటికీ సైంటిఫిక్ రుజువులు ఉన్నాయి. మనకింకా కొన్ని తెలియవు అంతే అంటారు)

ఇక ప్రకృతి గురించి చెప్తాడు భగవానుడు.

ఈ ప్రకృతికి ఆది అంతము లేవు. పురుషునికి కలిగే గుణములన్నీ, వికారములన్నీ, ప్రకృతి వల్లనే పుట్టి వృద్ధి చెందుతాయి. ఈ శరీరోత్పత్తి ఇంద్రియ వ్యాపారము సుఖదు:ఖ ప్రేరేపణ అన్నీ కూడా కలిగించేది ప్రకృతే. ఇది కలిగించే త్రిగుణములు అనగా సత్త్వ, రజ, తమోగుణముల వల్ల బుద్ధి చెడి తృప్తి లేక పురుషుడు పాపకర్మలు చేసి కొన్ని పుణ్యాలు చేసి వాటి ఫలితముగా ఎన్నో జన్మలనందుచున్నాడు. ఇట్టి పాంచభౌతిక శరీరంలో కర్మఫలంతో జన్మలందే జీవులే పురుషులు.

మరి ప్రకృతి క్షేత్రజ్ఞుల కతీతుడు ఆ పరమ పురుషుడైన భగవానుడు. ఆయన అన్ని దేహములలో ఉన్నా అంటీ

అంటనట్లుంటాడు. జగత్సాక్షి 'భర్త' ఈశ్వరుడు ఆయనే. ఆయన అనుమతి లేనిదే ప్రకృతిలో ఏ పనీ జరగదు.

మరి ఆ పురుషుని వల్ల కొందరూ, జ్ఞానయోగంవల్ల కొందరూ, కర్మయోగం వల్ల కొందరూ ఆ పరమాత్మను తమలోనే చూడగలుగుతున్నారు. అట్లు చూడలేని అన్య భక్తులు గురువుల నాశ్రయించి వారి ఉపదేశం పొంది భక్తిమార్గం ఆచరించి ఆ పరమాత్మని పొందగలరు. సంసార మృత్యువును దాటగలరు.

ఇంకొక ముఖ్య విషయమేమంటే పరమాత్మ నావిధంగా గ్రహించగలిగిన జ్ఞాని తనని తను వృథాగా హింసించుకోక జ్ఞానంతో ఆ పరమాత్మను పొందగలుగుతాడు. సర్వమూ ప్రకృతి వల్ల జరుగుతుందని తను నిమిత్త మాత్రుడనని తెలుసుకున్న ఆ జ్ఞాని, సర్వభూతాలూ ఒకే ఆత్మలో కలవని అచట నుంచే విస్తరించుచున్నవని గ్రహించగలడు.



అట్టి జ్ఞాని గ్రహించిన పరమాత్మ తత్త్వం ఎలావుంటుందంటే, పరమాత్మ జన్మరహితుడు, గుణ రహితుడు కర్మఫల రహితుడు. ఏ దేహములోనున్నా దానికి కర్తకాదు. దేహంలో సూక్ష్మరూపాన ఉన్నా దేహమంతా వ్యాప్తి ఉన్న ఆత్మ కలుషితమవదు.

క్షేత్రజ్ఞుడు సూర్యుడెట్లు లోకాలకి తేజమిస్తాడో అలా క్షేత్రాలనున్న తన జ్ఞాన జ్యోతితో నింపుతాడు. చివరికి పరమాత్మ జ్ఞానంతో ఈ విధంగా క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగం తెలుసుకో గలిగిన భక్తులకు పరమపదము దొరుకుతుంది.

## 14. గుణత్రయ విభాగ యోగం

ఇక 14వ అధ్యాయం: గుణత్రయ విభాగ యోగం. ఇదికూడా భగవత్సంకల్పం చేత మానవుల కర్మఫలంగా కలిగే త్రిగుణములు అనగా సత్త్వరజతమోగుణము లెట్టివో ఎట్లా కలుగుచున్నవో అవి ఎట్లు వృద్ధియగునో వానిచే మరణించిన ఏమగునో మరియు వాటిని అధిగమించు



గుణాతీతుడెటువంటివాడో తెలుపుతుంది ఈ అధ్యాయం.

భగవానుని దృష్టిలో ఈ త్రిగుణ విభాగము వాటిగురించిన జ్ఞానము చాలా ఉత్తమమనియు, మునులకు కూడా ముక్తిదాయకమనియు, జన్మ రాహిత్యము కలిగించునదియు, ప్రళయాంతమున కూడా నాశనము కలిగించలేని మహిమగలది అనియు అందుచే నీకు చెప్తాను వినుమంటాడు పరమాత్మ అర్జునితో.

ఓ అర్జునా ఈసృష్టి నేను ఇదివరలో చెప్పినట్లు ప్రకృతివల్లనే జరుగుచున్నది. మూలప్రకృతి అనే యోనియందు నేను సృష్టి బీజముంచి సర్వప్రాణికోటి జన్మలకు కారణభూతుడవుచున్నాను. అందుచే అన్ని జాతులకు ప్రకృతియే తల్లి, బీజమిచ్చు తండ్రిని నేనే.

అందుచేత ఓ అర్జునా త్రిగుణములైన సత్త్వరజతమోగుణులు నిత్యమైన ఆత్మను మానవ శరీరమందు ఏదో ఒక బంధముచే బంధించి ఉంచుతున్నాయని



గ్రహింపుము.

ఇక ఈ త్రిగుణములెట్టివో తెలుసుకొనుము.

సత్త్వగుణము ఎంతో నిర్మలమై, కాంతి ఆరోగ్యము నొసగును. ఆత్మజ్ఞానము పరమ సుఖములయందు ఆసక్తి పెంచి వాటిమీద ధ్యాసతో ఆత్మను శరీరమునకు కట్టుబడునట్లు చేయును.

రజోగుణమువల్ల అహంకారమూ, కర్మలయందు దర్పముతో కూడిన ఆసక్తి, భోగలాలస కలుగును.

తమోగుణము అజ్ఞాన జనితము ప్రాణులన్నిటియందు అవివేకమును పెంచి దానివలన నిద్ర, బద్ధకము, దైవేచ్ఛయందు పరకాయుండి, వాటిమూలంగా ఆత్మను శరీరమునకు కట్టుబడునట్లు చేయును.

అయితే ఈ త్రిగుణాలవల్ల మనిషి ప్రవర్తన ఎట్లు మారునో వినుము. సత్త్వ గుణము హెచ్చిన వానికి పరమ

సుఖము లభించును. రజోగుణము హెచ్చువాడు కర్మయందు రక్తుడై ఆ కర్మ ఫలమనుభవించుచునే యుండును. తమోగుణము హెచ్చువాడు అజ్ఞానియై యుండును. కానీ అదితగదు.

ఇంతియేగాక మనిషిలో రజోతమోగుణములు తగ్గినప్పుడు, సత్త్వగుణము అధికమగును. సత్త్వతమోగుణములు తగ్గినపుడు రజోగుణము అధికమగును అట్లే సత్త్వరజో గుణములు తగ్గినపుడు తమోగుణము అధికమగును.

ఆ తర్వాత మనిషిలో ఏ గుణము అధికమగుచున్నదో తెలిసికొనుట కూడా అతి సులభము. సత్వగుణము వృద్ధి చెందుచున్నప్పుడు ఆ మనిషి ఇంద్రియమ్ములనుండి జ్ఞానజ్యోతి కనిపించును.

రజోగుణము వృద్ధి చెందుచున్నప్పుడు శాంతి కరువవుతుంది, లోభం పెరుగుతుంది, కర్మలయందు ఆసక్తి పెరిగి కర్మఫలమందు ఆస జనిస్తుంది.



తమోగుణము వృద్ధి చెందుచున్నప్పుడు బుద్ధి మాంద్యము, బద్దకము, సర్వవిషయములందు నిర్లక్ష్యము ఒనగూడి అజ్ఞానము హెచ్చును. మరియొక విషయము సత్వగుణవృద్ధియగువేళ మరణించిన, యోగిపుంగవులు పొందు మంచిలోకములు పొందుదురు. మరుజన్మయుండదు. రజోగుణవృద్ధి యపుడు మరణించిన పునర్జన్మలో కర్మకాండలు శ్రద్ధగా జరుపు ఇంటయందు జన్మింతురు.

తమోగుణ వృద్ధి యపుడు మరణించిన, పశుపక్షి జన్మలైననూ లేక పామరునిగానో జన్మించును.ఆ జన్మలలో కూడా కర్మఫలప్రాప్తిచే దు:ఖములనుభవించుచూ తమోగుణాలు, అజ్ఞానముచే జీవనము గడుపుచూ తమోగుణులూ ఉండగా, జన్మలేక శ్రేష్టమైన బ్రహ్మజ్ఞానముచే పరమ సుఖములనుభవిస్తుంటారు సత్త్వగుణులు. ఆ రీతిగానే మరణానంతరం జన్మలు సంభవిస్తాయి. అయితే కర్మలన్నిటికీ గుణములే కర్తలని తను నిమిత్త మాత్రుడనని ఎరిగి పరమాత్మ తత్త్వము మాత్రమే గుణరాహిత్యమని తెలిసెడి జ్ఞాని



ముక్తినొందగలడు. ఆ జ్ఞాని సాధన చేత ఈ త్రిగుణములను అధిగమించును.

అప్పుడు అర్జునుడిలా అన్నాడు. ఓ ప్రభూ త్రిగుణములు దాటగల ఆ ధన్యునేమందురు? వాని లక్షణములేవి? వాటినతడెట్లు దాటగలడు, చెప్పగలవు అని అడిగాడు.

అప్పుడు భగవానుడిలా అన్నాడు. ఓ అర్జునా అట్లు త్రిగుణములను దాటగల్గిన వానిని గుణాతీతుడందురు.అతడు సత్త్వ గుణముచే గల్గు సౌఖ్యమును, రజముచే గల్గు కర్మకాండను, తమముచే గల్గు మోహమును అనుభవించుచున్ననూ ఆ గుణములను ద్వేషింపడు. అలాగని వాటిని కోరడు. వాటియందు చిక్కుకొనడు. ఈ గుణముల కెల్ల ప్రకృతియే కారణమని తెలిసి స్థిరబుద్ధితో సుఖదు:ఖములు సమానంగా తలచి మట్టి, రాయి, బంగారములయందు బేధము కానకయుండును. శత్రువులు మిత్రులు అతనికొక్కటే. ప్రేమ, ద్వేషము, దూషణముల కతను విరక్తుడు. ఆత్మావలోకనమునందే తన సమయము గడుపును.



నన్ను అనన్య భక్తిచే సేవించును. అనితర సాధ్యమగు ముక్తుని పొందును. గుణరాహిత్యమునొందగలుగును.

ఏలననగా నేనొక్కడినే వినాశరహితం, వికార రహితం, శాశ్వత దర్మ స్వరూపం, అఖండ స్వరూపం అయిన బ్రహ్మమునకు నిలయమును. నేనే ముక్తిప్రదాతను.

రామాయణంలో రావణ కుంభకర్ణ, విభీషణులు రజో, తమో, సత్త్వగుణములకు ప్రతీకలు.

ఈ విధంగా గుణత్రయ విభాగం ముగించాడు పరమాత్మ.

## 15. పురుషోత్తమ ప్రాప్తి యోగం

ఇక 15వ అధ్యాయం : పురుషోత్తమ ప్రాప్తి యోగం. పురుషోత్తముడనగా పరంధాముడైన ఆ పరమాత్మ. ఈ అధ్యాయంలో భగవానుడు సంసార వృక్షమును గూర్చి, పరమపదమునందుటకు దానినెలా ఛేదించాలి, క్షరమగు

దేహము అక్షరమగు జీవాత్మ వీనినన్నిటినీ మించిన పరమాత్మ గురించి అతని పురుషోత్తమ తత్త్వం గురించి చెప్తాడు.

ఓ అర్జునా! సంసారమనబడే ఒక అశ్వత్థవృక్షముంది. అది నాశరహితము. దాని ఆకులు వేదములు. దాని వ్రేళ్ళు పైభాగమున కొమ్మలు భూమిలోనా ఉంటాయి. కేవలం వేదార్థం తెలిసిన వారికే దాని నిజమైన రూపం అవగతమవుతుంది. దాని కొమ్మలే త్రిగుణములవల్ల వృద్ధి అవుతాయి. చిగురులేమో విషయ సుఖములు కర్మానుగుణములైన అహంకార మమకారములు దాని వ్రేళ్ళుగా అధోలోకమంతా వ్యాపించియున్నది. త్రిగుణములు ఊర్ధ్వలోకమున వ్యాపించగా దాని ఆది అంతమూ తెలియలేని మానవులు సుఖదుఃఖములలో, జన్మలలో తపిస్తుంటారు. అయితే వైరాగ్యమనే ఖడ్గముతో దానిని ఖండించగల ధన్యులు మాత్రం మరుజన్మలేని పరమపదం పొందగలుగుతారు. అది చేయాలంటే ఆ వృక్షాన్ని నరికి పరమాత్మ శరణు జొచ్చి అభిమానము, అవివేకము, మోహము వీడి ఆత్మజ్ఞానంతో నిష్కాములై



సుఖదుఃఖములందు సమవర్తులై యుండవలెను. మరి పరమాత్మ నేల శరణుగోరవలెననగా, ఈ వృక్షాభివృద్ధికి లయమునకు కూడా ఆయనే కారణభూతుడు కనుక.

మరి ఆ పరంధామమెట్టిదనగా సూర్యచంద్రుల ప్రమేయంలేకనే అది స్వయం ప్రభవలె తేజోమయం. అందుచేత దానిని చేరు వారికి సంసారబంధములు, జన్మలు ఉండవు.

ప్రతి జీవిలో ఉండే జీవాత్మ ప్రకృతి మహిమవల్ల జ్ఞానేంద్రియమ్ములను, మనసును మోహపరచి విషయలోలుని చేయును. పూవుల వాసనను గాలి ఏ విధంగా ఒక చోటనుంచి ఇంకొక చోటికి కొనిపోగలదో జీవుడు మనసును ఇంద్రియములను వీడి ఇంకొక దేహమును చేరుచున్నాడు. మరల ఆ దేహమున పంచేంద్రియములను మనస్సును ఆశ్రయించి విషయ సుఖములననుభవించును. అందుచే సామాన్యులు ఆ జీవాత్మ చేయు పనులను గాని దాని ఉనికిని గానీ గ్రహించలేక విషయ సుఖాను రక్తులవుతారు.

కానీ జ్ఞానులుమాత్రం తత్త్వజ్ఞానంవల్ల ఆ జీవాత్మను



గ్రహించి గొప్పసాధనచే దాని మాయనుండి బయటపడి విషయ సుఖములయందు విరక్తులయి ఆత్మ సంస్కారం పొందుతారు. మూర్ఖులా పనిచేయలేరు.

ఓ అర్జునా సూర్యచంద్రుల నిజమైన తేజము నాదే సుమా! అగ్నియొక్క సర్వ భోక్తత్వము నాదే. చంద్రునిద్వారా సస్యరక్షణచేసి నేనే అన్ని భూతాలకు తిండి పెడుతున్నాను. వైశ్వానరుడనై జఠరాగ్నినై నేనే వారుతిన్న తిండిని జీర్ణింపచేస్తున్నాను. వారిప్రాణ అపానవాయువులను నియంత్రిస్తున్నాను. వారి జ్ఞాపకము, మరపు జ్ఞానం ఇవన్నీ నావల్లే కలుగుతున్నాయి. నేనే వేదాంతకర్తనూ, వేద విహితుడను, వేదవేత్తనూ అయి ఉన్నాను. పురుషులందు క్షరుడు నాశనమగు వాని దేహము. అక్షరుడు నాశనములేని జీవాత్మ. వీరికన్న ఉత్తముడే నిశ్చయముగా పురుషోత్తముడుగదా. అది నేనే అని గ్రహించువాడే నిజమైన యోగి.

క్షరుడిని అక్షరుడిని మించి వేదప్రఖ్యాతుడనైన



పురుషోత్తముడను నేనే. నానివాసమే పరంధామము. ఇది తెలియవలెనన్న ముందు పురుషులు అజ్ఞానమును వీడవలెను. అట్లు వీడినవాడు నన్ను పురుషోత్తమునిగా గుర్తెరిగి సర్వజ్ఞుడై ఎన్నో విధములుగా నన్ను భజించును.

నీ యందు చెలిమిచే ఈ శాస్త్ర జ్ఞానము నీకు బోధించుచున్నాను. అందుచే కృతార్థుడవయి అజ్ఞానమును, మోహమును వీడుము.

ఈవిధంగా అర్జునుని కర్తవ్యోన్ముఖుని చేయాలని చూస్తాడు భగవంతుడు.

ఇదంతా జ్ఞానం. అధ్యాత్మజ్ఞానం కాబట్టి మళ్ళీమళ్ళీ చెప్పినట్లు ఉంటుంది. రుచి చూడని ఏపదార్థాన్నయినా తిన్నప్పుడు ఏదో వింతగా, మొదట నచ్చనట్లుంటుంది. దాని రసాస్వాదనకు కొంత సమయం పడుతుంది. అలాగే అధ్యాత్మిక జ్ఞానం కూడా మొదట విసుగనిపించినా మనస్సుని లగ్నం చేసినకొద్దీ చాలా మనశ్శాంతిని కలుగచేస్తుంది.

## 16. దైవాసురసంపద్విభాగ యోగం

ఇక 16వ అధ్యాయం : దైవాసురసంపద్విభాగయోగం. అనగా దైవ సంపద ఏదో అసుర సంపద ఏదో విడమరచి వారిలక్షణాలు అవి ఉండడం వల్ల కలిగే పర్యవసానాలు తెలిపే జ్ఞానవే ఈ అధ్యాయంలో భగవానుడు అర్జునునికి తెలియజేస్తాడు.

భగవానుడిలా అన్నాడు. **ఓ అర్జునా మనుష్యుల జన్మలు వారి కర్మఫలం వల్ల ఏర్పడుతాయని తెలిసిన పిదప ఆ కర్మఫలం దైవ సంపద మరియు అసుర సంపద అని రెండు విధములు అని తెలుసుకొనుము. దైవసంపద అనగా దేవునకు సంబంధించిన గుణవిశేషం అని అర్థం.**

ఈ అధ్యాయంలో వింత ఏమిటంటే ఇది దైవాసుర సంపదలను విభాగించేదయినా దైవ సంపదలు గుణములు గల యోగులను భక్తులను ఇదివరకటి అధ్యాయాల్లో ఎన్నోమార్లు పదే పదే వర్ణించుట చేత దీనిలో కేవలం 3, 4 శ్లోకాలలో ఆ



దైవ సంపదను ముగించి, అసుర సంపద అనగా రాక్షస గుణములు వాని కర్మల ఫలముల గురించి దాదాపు 20 శ్లోకాలలో వర్ణిస్తాడు భగవానుడు. ఎందుచేతనంటే ఇదివరకు అధ్యాయాల్లో ఇట్టి దుర్మార్గుల గురించిన ప్రస్తావన చాలా తక్కువ వస్తుంది. అందుచేత.

మొట్టమొదట దైవ సంపదవల్ల జన్మించే దేవాంశ సంభూతుల గురించి చెప్తూ భగవానుడు వారికి (ఇరవై ఆరు) శ్రేష్ఠమయిన గుణాలుంటాయి అని అవి ఏవో చెప్తాడు.

**అట్టి దైవాంశ సంభూతులు నిర్భయులు, చిత్తశుద్ధి, జ్ఞానము, యోగనిష్ట, దానగుణము, ఇంద్రియ నిగ్రహము, వేద పఠనము, యజ్ఞతపములందు ప్రయత్నము, సరళ స్వభావము, సత్యము, అహింస, శాంతస్వభావము, త్యాగబుద్ధి, భూతదయ, కోపమునకు లోను కాకుండుట, మార్దవము, సిగ్గు(చెడు చేయుటకు) నిశ్చలత్వము, నిర్మలత్వము, ఓర్పు, తేజము, ధైర్యము, శుచిశుభ్రతలు, ద్రోహ చింతనలేకుండుట,**



**దురభిమానము లేకుండుట, పరులపైన ఈర్ష్యతో చాడీలు చెప్పకుండుట మొదలగు ఇరవై ఆరు గుణములు కలిగి యుందురు. వీరలకు అంత్యమున తప్పక మోక్షము కల్గును. నీవుకూడా దైవాంశ సంభూతుడవే కావున నీకు కూడా కర్మబంధములుండవు కావున యుద్ధము చేసి శత్రు సంహారము చేయుము,** అన్నాడు భగవానుడు.

**ఇది ఇట్లుండగా అసుర సంపదచే జన్మించిన వారి గుణము లెట్లుండునో వినుము. వారికి అధికమైన గర్వము, కఠినమైన మనస్సు విపరీతమైన కోపము, తగని అభిజాత్యము, స్వతసిద్ధంగా ఉంటాయి.** మనం మనకు తెలిసిన రాక్షసులను తలచుకుంటే ఇవన్నీ వాళ్ళకే ఉంటాయి. రాక్షసుడంటే ఆకాశమంతెత్తు, బానెడంత కడుపూ, కోరలూ ఉండక్కరలేదు. ఈ గుణాలున్న ప్రతిమనిషీ రాక్షసుడే. వారిని సంహరించడానికే భగవానుడు యుద్ధమును సాధనంగా ఎన్నుకున్నది.

జీవికి కర్మబంధం కలిగించే అసుర సంపద గురించి భగవానుడింకా ఇలా చెప్పాడు.



**ఓ అర్జునా అసుర స్వభావులకు హితము అహితములకు తేడా తెలియదు. శుచి సదాచారములుండవు. అసత్యావాదులు, నాస్తికులు, సృష్టి జరుగుచున్నది కేవలము కామకేళివల్లనని భగవంతుడనేవాడెవడూ లేడని వారు మూర్ఖముగా వాదించుచుందురు. సత్యవచనము నిష్ఫలమని ఆత్మజ్ఞానము లేక అల్పబుద్ధులయి ఘోరమైన పాపకర్మలు చేస్తుంటారు. లోక నాశనమునకు కూడా వెనుకాడరు. లోక కంటకులలు సజ్జనులను బాధిస్తుంటారు.**

**వారి కోర్కెలు అపరిమితం. గర్వము మిక్కుటము, దురభిమానము ఆడంబరములే వారి భూషణములు. దురాచారము అవివేకము వారి నైజములు. చచ్చిపోయేదాక కామంతో భోగలాలసులయి ఆశాపాశమున బడి ఎంత ధనముంటే అంత ఘనమని ధనార్జనకై ఎన్నోపాపములు చేస్తుంటారు. ఇకవారి మనోభావాలు ఎలావుంటాయో వినుము. ఈ ఘనకార్యం నేనే చేశాను. నాకోర్కె ఏదైనా తీర్చుకోగలను.**

**నాకెంతో సంపద కలదు. శత్రు నిర్మూలన నా లక్ష్యం. సుఖాలన్నీ నా స్వంతం. నేనే ప్రభువును. దేనినైనా సాధించగలను ఎంతో బలశాలిని ఉన్నతవంశ సంజాతుడను నాకు సాటి ఎవరూ లేరు. నేను చేసే యజ్ఞాలు దానాలు ఎవ్వరూ చేయలేరు. ఇటువంటి అజ్ఞానముతో భోగములు నిత్యములని తలచి ఘోరనరకంలో మగ్గుచుందురు.**

**వారికి వినయం ఉండదు. స్వోత్కర్ష ప్రవీణులు, శాస్త్రమునకు విరుద్ధముగా , గర్వ దర్పములు కలిగి ఉండెదరు. ఈర్ష్య క్రోధముల వలన ఈ అసురులు సహజంగానే నన్ను ద్వేష బుద్ధితో చూచి నా గురించి తెలుసుకోలేక పోతున్నారు. అటువంటి రాక్షస గుణోపేతులను క్రూరులను నేను మరల మరల సంసార కూపాన పడవేస్తున్నాను. వారికి జన్మలనుంచి ముక్తి ఉండదు. ఏ జన్మలోనూ వారు నన్ను పొందలేరు. అధోగతి వారికి తప్పదు.**

మరి పరమపదము (మోక్షము) కావాలి అంటే ఏ దుర్గుణములు వదులుకోవాలో చెపుతాను వినుము.



**కామ క్రోధ లోభములను ఈ నరక ద్వారములను దాటగలుగుట ఆవశ్యము. ఆత్మ నాశనకారియగు వాటినొదిలిన కీర్తియును కలుగును. శాస్త్ర విధులను వీడి ఇష్టంవచ్చినట్లు సంచరించు వారికి సిద్ధి ముక్తి కలుగవు. అందుచేత ఏది హితకార్యమో ఏది అహితమో తెలుసుకొనుటకు శాస్త్ర మొక్కటే ప్రమాణము కావున అది చక్కగా తెలిసి జగతికి హితవైన సకర్మలు చేయవలెను.**

**అట్టి నియత కర్మలు చేసినవారే యోగ్యులగుదురు** అని చెప్పి ముగిస్తాడు కృష్ణ భగవానుడు.

## 17. శ్రద్ధాత్రయ విభాగ యోగం

ఇక 17వ అధ్యాయం : శ్రద్ధాత్రయ విభాగయోగం. ఈ అధ్యాయం నిజానికి గుణత్రయ విభాగ యోగానికి అదనపు భాగం అన్నట్లుంటుంది. విశ్వరూప సందర్శన యోగం తర్వాత వచ్చే అధ్యాయాలన్నీ భక్తుడైన అర్జునునికి భగవానుడు జ్ఞానబోధ చేస్తూ ఎన్నో విషయాలు చెప్తున్నట్లుంటాయి. మరి స్వామి



జగద్గురువు కదా.

అర్జునుడి కొచ్చిన ధర్మసందేహం ఏమిటంటే ఒకవేళ ఎవరైనా భక్తుడు కొన్ని కారణాల వల్ల శాస్త్ర విధానమును అనుసరించకుండా కేవలం భక్తి శ్రద్ధలచే దైవమును పూజించుచుండిన వాడెట్టి స్థితిలోఉన్నవాడు అనగా వాని గుణమేది సాత్త్వికమా రాజసమా లేక తామసమా?

దానికి భగవానుడిలా అన్నాడు. **ఓ అర్జునా! శాస్త్ర విధానము తెలియక పోయినా ప్రాణులకు సహజముగా త్రివిధములైన శ్రద్ధలు కలుగుతాయి. వాటి గురించి చెప్తాను విను.**

**ఏదోఒక శ్రద్ధ అనునది లేని మానవుడుండడు. ఎవని శ్రద్ధ ఎటువంటిదో వాడు అట్టి స్వభావముగల మానవుడగుచున్నాడు. సాత్త్వికులు తేజోమయులగు దేవతలను, రాజసులు యక్ష రాక్షస గణములను, తామసులు భూత ప్రేత పిశాచ గణములను పూజించుచుందురు.**



**ఇదివరకు చెప్పినట్లే అసుర స్వభావులు శాస్త్ర ధర్మములు విడనాడి ఘోరతపస్సులలో దేహములను కృశింప చేసి అహంకారము ఆడంబరములు వీడక బలగర్వంతో రాక్షస ప్రవృత్తితో జీవిస్తారు.**

**అర్జునా! మనుష్యులకు ప్రీతి పాత్రమయిన ఆహారము, వారు చేయు యజ్ఞము తపము వారి జ్ఞానము ఇవి అన్నియు త్రివిధములయిన శ్రద్ధలుగా విభజింపబడినవి. అవే సాత్త్విక రాజస తామస శ్రద్ధలు. వాటి విభాగము నీకిపుడు వివరిస్తాను వినుము.**

**ఆహార విషయమున, సాత్త్వికమైన ఆహారము ఆయువును, బుద్ధిని, ఆరోగ్యమును, బలమును, సుఖ సంతోషములను వృద్ధి చేయు శ్రేష్ఠమైన ఆహారము. చక్కటి రససిద్ధి, చమురులతో కూడి ఆకలి నణిగించి మనస్సుకు ఆనందము కలుగచేయునదే సాత్త్వికాహారము.**

**అట్లే రాజసులకు ప్రీతి పాత్రమైన ఆహారము చేదు**

**పులుపు, ఉప్పు, కారము మొదలైన రుచులతో వేడిగా యుండి చమురు లేక విపరీతమైన దాహము కలుగచేసి దేహమునకు బాధ కలుగచేసి రోగము నొసంగునదైయుండును.**

**ఇక తామసులకు ప్రీతి అయిన ఆహారము నిస్సారమైన చల్లబడి, చద్దియైనది ఎంగిలియైనది అగు అపవిత్ర ఆహారము.** దొరికినదానితో తృప్తి పడమని చెప్పిన భగవానుడు కేవలం శరీరం నిలుపుకోడానికే తిండి తినమనే పరమాత్మ రుచులగురించి ఎంగిలి గురించి చెప్పటం ఎందుకు? కంటామినేటెడ్ ఫుడ్ రోగం తెప్పిస్తుంది కదా. ఎంగిలి తినువారు ముష్టివారుగానూ కారము తినువారు అహంకారులుగానూ, తీపితినువారు దైవసమానులుగా భావించుకుని ఏదో గొప్పగా భావించుకుంటున్నారు. పగలు వండిన పదార్థములు రాత్రిలో తినకూడదని గొప్పలుపోయి అప్పుల పాలవుతున్న మూర్ఖులు ఉన్నారు. నిజానికి భగవంతుని ఉద్దేశ్యం శుచిగా, కోపతాపాలు కలిగించని (ఉప్పు కారం ఎక్కువగా లేని) మితమైన ఆహారం తినమని. అంతేకానీ ఎంగిలి తినవద్దని, భగవంతుడంటే వెన్న,



చద్దులు అందరితో కలిసి తింటాడా?

భగవానుడిలా అంటున్నాడు. **యజ్ఞములు కూడా మూడు విధములు.**

**ఎవరైతే అది తమ బాధ్యతగా భావిస్తూ ఫలమాసించక శాస్త్రోక్తంగా నియమంగా యజ్ఞమునాచరిస్తారో అది సాత్త్విక యజ్ఞం. యోగులు, సాధువులు, ప్రజా శ్రేయస్సుకి చేసే యజ్ఞాలు ఇలాంటివే. అట్లే ఫలమునాశించి (పిల్లలు కలగాలి, దరిద్రం తీరాలి అనుకుంటూ) తమయొక్క దర్పం చూపిస్తూ జరిపించే యజ్ఞం రాజసం అంటారు.** నేడు ప్రపంచంలో జరిగే యజ్ఞాలన్నీ దాదాపు ఇలాంటివే.

**ఇక తామస యజ్ఞం అంటే నియమాలు వదిలేసి అన్నదానంకూడా లేకుండా మంత్ర దక్షిణలు సరిగా లేక జరుపు యజ్ఞం అని తెలుసుకొనుము.**

**తపములు కూడా త్రివిధములు. మనోవాక్కాయములతో చేయు ఈ తపములెలా వుంటాయో వినుము. దేవ, బ్రాహ్మణ,**



**గురు, దైవజ్ఞులను పూజించి నిష్కపటంగా శుచిగా బ్రహ్మచర్యదీక్ష పాటించుచూ, అహింసా వ్రతముతో తపము చేస్తే అది కాయము చేయు తపము.**

**పరనింద, నిష్ఠూరములు మాని హితమైన మాటలాడుచూ సత్యవాక్పరి పాలనతో వేదపారాయణ చేయుటయే వాక్కు చేయు తపము. నిర్మలమైన మనస్సుతో మౌనవ్రతం చేస్తూ ఆత్మ నిగ్రహంతో శాంతి పూర్వకంగా శుద్ధ అంత:కరణతో ఉంటూచేసే తపము మనస్సు చేసే తపము అవుతుంది.**

**ఇట్లు మనోవాక్కాయములు చేయు తపము కూడా త్రివిధములే నిర్మలమైన ఆత్మతో గొప్ప నిష్ఠతో ఫలాపేక్ష లేక పైన చెప్పిన తపములు చేస్తే అది సాత్త్వికమైన తపము అవుతుంది. అదే తపము సత్కారములు, సన్మానములు ఆశిస్తూ పొందుతూ దాంబికముగా చేయునెడల దానిని రాజస తపమందురు. దానివల్ల కల్గు ఫలితము కూడా అస్థిరమే.**



**అనగా కొన్నాళ్ళకు నశించునదే.** అసురులు ఎక్కువగా చేయు తామస తపము ఎట్లుంటుందంటే మొండిపట్టుదలయు శరీరాన్ని హింసించుకుంటూ ఎవరినైనా గెలిచి హింసించాలనే కోర్కెతో చేయబడుతుంది. మరి హిరణ్యకశిపుడులాంటి వాళ్ళు చేసేది అలాంటి తపస్సే.

**ఇకపోతే దానము కూడా మూడు విదములు.**

**దానము చేయుటయే కర్తవ్యమని సుదినాలప్పుడు యోగ్యతగల వారికి ప్రత్యుపకారం చేయలేనివానికి చేసే దానం సాత్త్వికము.** శిబి కర్ణుడు ఈ కోవకు వస్తారు.

**ప్రత్యుపకారం ఆశిస్తూ ప్రతిఫలాల కోసం మనస్సులో కించిత్తు మధన పడుతూ చేసే దానం రాజసం అవుతుంది.** దాదాపు మనబోటి వాళ్ళు చేసేదంతా ఇలాంటిదే.

అయితే హీనులకు అపాత్రులకు అవమానిస్తూ హేయంగా ఎక్కడ పడితే అక్కడ చేసే దానం తామసదానం అంటారు. మనం ముష్టివాళ్ళకి చిల్లర విదిలిస్తామే. అదే ఆ

దానం. దానివల్ల ఏమీ పుణ్యం ఉండదు. అయినా కృష్ణార్పణం అని చేస్తే కొంత నయం. ఈ విధంగా త్రివిధములైన శ్రద్ధలగురించి చెప్పిన భగవానుడు పరబ్రహ్మ రూపమైన మరో మూడు పదముల గురించి చెప్పి ఈ అధ్యాయం ముగిస్తాడు.

**పరబ్రహ్మకు ఓమ్, తత్, సత్ అనే మూడు పేర్లు పర్యాయపదాలుగా ఉన్నాయి. పూర్వం దానివల్లనే బ్రాహ్మణులు వేదాలు యజ్ఞాలు సృష్టించబడ్డాయి అట్టి మంగళకరమైన పదాలు కాబట్టే శుభప్రదమైన శాస్త్రయుక్తమైన యజ్ఞ, దాన, తపములను, పూజలను, ఓమ్ అని ఉచ్చరిస్తూ మాత్రమే మొదలు పెడతారు.**

**ఆ విధంగా ఫలాపేక్ష లేని ముముక్షువులు కూడా ఈ యజ్ఞదానతపములను తత్ అనుచూ ఆచరిస్తుంటారు. సత్ అనగా ఉత్తమమైన శుభకరమైన కర్మలను సత్ అంటూ చేస్తారు. ఈశ్వరునికి ప్రీతిపాత్రమైన సకర్మలు చేసినా తపయజ్ఞ దానములు కూడా సత్ అనే గ్రహింపవలెను.**



**అట్లే శ్రద్ధ లేక చేసే తపము యజ్ఞము దానము కోరికలు తీరటానికి చేసే కర్మలు అసత్ అని గ్రహింపవలెను. అసత్ వలన ఇహపరములయందు ప్రయోజనము సిద్ధింపదు.**

ఈ విధంగా శ్రద్ధాత్రయ విభాగయోగం ముగిస్తాడు భగవానుడు.

## 18. మోక్ష సన్యాస యోగము

ఇక 18వ అధ్యాయమూ ఆఖరిదీ అయిన మోక్ష సన్యాస యోగం గురించి తెలుసుకుందాం. నిజానికి ఈ అధ్యాయం ఇదివరకు చెప్పిన అన్ని విషయాలను ఒక్కచోట క్రోడీకరించేదిగా వుంటుంది. చాలావరకు చెప్పిన విషయాలే చెప్పటం జరుగుతుంది. అయితే మళ్ళీ ఒక్కసారి అర్జునుడికి భగవానుడి ఔచిత్యం తెలియటం, తను నిమిత్త మాత్రుడిననే భావన కలగటం, తన స్వధర్మ రక్షణకి శత్రు సంహారం చేసినా పాపం రాదని తెలుసుకోవటం, దోషంలేని కర్మలుండవు కావున అన్నీ కర్మఫలాలూ భగవదర్పణ చేసి కర్తవ్యం నెరవేర్చాలనే జ్ఞానం



కలగటం భగవంతుడు చెప్పిన సాత్త్విక రాజస తామసులలో తను సాత్త్విక ప్రవృత్తి గలవాడననే ధైర్యం కలగటం, కర్మలు కలగటానికి కూడా తను కారణం కాదనే సత్యం తెలియటం, చతుర్వర్ణాలను సృష్టించిన దేవదేవుడు క్షత్రియుడైన తన ధర్మం మరొక్కసారి గుర్తుచేయటం, స్వకర్మలు సక్రమంగా చేస్తే మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వరూపుడే చెప్పటం, తనకబ్బిన జ్ఞాననిష్ఠతో తనకి పరమపదముతప్పక కలుగుతుందనే ధైర్యం కలగటం, తనని నమ్మితే భవజలధి దాటించగలనని భగవానుడి అనునయంవల్ల ఊరట కలగటం, నీవు యుద్ధం చెయ్యననుకున్నా నీ ప్రకృతే నీచేత యుద్ధం చేయిస్తుందని భగవానుడు నిస్సందేహంగా చెప్పటం, మానవులంతా ఆ దేవుని చేతిలో బొమ్మల వలె ఆడుతూ ఉంటారనే సత్యం అవగాహన అవటం. చివరికి సంజయుడు అతి సంతోషంతో విశ్వరూప సందర్శనం మిగిల్చిన తృప్తితో భగవద్గీతయొక్క బోధ ముగించటం జరుగుతాయి.



ఇది చాలా పెద్ద అధ్యాయం. పైన చెప్పిన దంతా జరుగుట ముందు భగవానుడు కర్మ విసర్జన ఏల చేయరాదు, త్రిగుణాత్మకమైన త్యాగము. కర్మ, కర్త, జ్ఞానము, ధైర్యము, బుద్ధి, చతుర్వర్ణముల వారి విహిత కర్మలూ మొదలైన ఎన్నో అంశాల గురించి చెప్తాడు.

అర్జునునికి వచ్చిన సందేహం **ఓ కృష్ణా! నాకు సన్యాసము మరియు త్యాగము వీటి తత్త్వమును మరియొకసారి చెప్పు** అని అడుగుతాడు.

భగవానుడిలా అన్నాడు. **ఓ అర్జునా పండితులు ఫలితము నొసగెడి ఏ కర్మనయినా త్యజించుటయే సన్న్యాసము. అట్లేగాక కర్మలు చేసిననూ వాటి ఫలత్యాగమును, త్యాగమని భావింతురు. కొందరి దృష్టిలో ఏ కర్మకయినా ఏదో కొంత దోషముంటుంది కాబట్టి కర్మలు చేయరాదు అని తలంతురు. కొందరు దానము యజ్ఞము తపము మొదలయిన కర్మలను ఎంత మాత్రం వదలటానికి వీలులేదు అని తలుస్తారు.**

**నా ఉద్దేశ్యంలో ఈ త్యాగం మూడు విధాలు సాత్త్విక,**

రాజస, తామసములు. అట్లే తపము, యజ్ఞములగురించి ఇదివరకే తెల్పితిని. అయితే అవి ఎటువంటి వయినా ఉత్తములకు చిత్తశుద్ధి నిచ్చునవి కనుక వానిని వదలరాదు. ఫలాపేక్షవీడి ఆ కర్మల నాచరించవలెను. శాస్త్రవిహితములైన స్వధర్మము వీడుట కర్మత్యాగమెంత మాత్రము కాదు. (అది పలాయన వాదము). అది తామస త్యాగము. ఉత్తమ కర్మలు చేసి వాటి ఫలత్యాగము చేసిన అది సాత్త్విక ఫలత్యాగము. అయితే శ్రమ కలుగుతుందని భయంచేత కర్మలొదిలేస్తే అది రాజస ఫలత్యాగం అవుతుంది. సాత్త్వికుడు కష్ట నిష్ఠూరములకు శుభ అశుభములకు వెరువక కర్మఫలత్యాగం చేస్తాడు.

ఈ ప్రపంచంలో ప్రతి దేహికీ కర్మత్యాగం అసాధ్యం. అట్లు చేయగల వాడే త్యాగి. ఏ కర్మఫలత్యాగం చేయక కర్మలను మాత్రమే చేసి మరణించినచో వాని కర్మల ననుసరించి సుఖమో, దు:ఖమో, మిశ్రమ ఫలితమో పొందును. అయితే కర్మఫల త్యాగులకు మాత్రము ఈ ఫలితములుండవు.



అయితే మానవులు ఈ కర్మలు చేయటానికి కల ఐదు కారణాలను సాంఖ్య శాస్త్రం వివరిస్తోంది. అవి ఏమంటే మానవుల దేహము, జీవాత్మ, ఇంద్రియములు. ఆ ఇంద్రియముల వ్యాపారములు, దైవము. వీటివలననే మనుజులు కర్మలను చేస్తున్నారు. మనోవాక్కాయములచే మంచిదో చెడ్డదో కర్మను ఆరంభించుటకు ఈ ఐదు కారణములే కానీ నిజమునకు మానవులు నిమిత్త మాత్రులు.

అయితే మూర్ఖులు బుద్ది సంస్కారం లేక ఆ కర్మలన్నిటికి తానే కర్త అనుకొని కర్మ ఆత్మ తత్వమును తెలియలేరు. నిజానికి అహంకార మమకారములను వీడిన జ్ఞాని దుష్టులను చంపికూడా పాపికాడు వానికి కర్మలుండవు. ఈ సూక్ష్మం తెలుసుకుని నీ కర్తవ్యం నెరవేర్చు.

ఇక ఈ కర్మలకు కారణములు ఆధారములేవో చెప్తాను వినుము. తెలుసుకోదగ్గ జ్ఞానం, తెలుసుకునేకర్త, వానికున్న



తెలివి ఈ మూడు కర్మలకు కారణములు. అట్లాగే ఈ కర్మలు చేసే సాధనము, ఆ కర్మ, కర్మచేసిన కర్త ఈ కర్మలకు ఆధారము. ఇది తెలిసికొనుము. అటులనే జ్ఞానము, కర్త కర్మలు కూడా త్రివిధములు. వేర్వేరు ప్రాణులందు కల ఆత్మ అవిభక్తమని, అవినాశకమని, నిత్యమని తెలియు జ్ఞానము సాత్త్వికము.

వేర్వేరు ప్రాణులందు కల ఆత్మలు వేర్వేరు అని భావించు జ్ఞానము రాజసము. అసలు తత్త్వ జ్ఞానములేక, సంకుచిత దృష్టితో తను చూస్తున్నదే నిజమని, సర్వస్వమని భావించే జ్ఞానము తామసము. ఆ విధంగానే కర్మలు కూడా త్రివిధములు. ఆసక్తి అభిమానము, అనురాగములు, ఫలాపేక్ష వీడి, శాస్త్ర హితముగా, ద్వేషములేకుండా ఒనరించు కర్మలు సాత్త్వికములు. ప్రతిఫలాపేక్షతో, అధిక శ్రమతో, అహంకారంతో, దర్పంతో చేసే కర్మలు రాజసములు. ఏది సాధ్యమో ఏది అసాధ్యమో కానక అవివేకంతో శక్తికి మించిన విధంగా చేయు కర్మలు తామసములు.



ఇదే రీతిగా కర్తలు కూడా త్రివిధములు. ప్రతిఫలాపేక్ష, అహములేని ధైర్యవంతుడు జయాపజయములనొకే రీతిగా పరిగణించు జ్ఞాని సాత్త్వికుడైన కర్త. ప్రతిఫలాపేక్షతో దురాశతో ఇతరులను అణగ ద్రొక్కుటకు శుచి శుభ్రత లేకుండా కర్మలు చేస్తూ వాటివల్ల సుఖదు:ఖములు పొందుతూ ఉండే కర్త రాజసం గూడిన కర్త. ఆత్మ నిగ్రహం లేకుండా అవివేకంతో దుష్టుడై ద్రోహబుద్ధితో కర్మలు చేసి విషాదముననుభవించి నిరుత్సాహంతో అలమటించే కర్తను తామస కర్త అంటారు.

ఓ అర్జునా ఇదే విధంగా బుద్ధి ధైర్యము కూడా త్రివిధములుగా విభజించబడినవి. వాటి వివరములు వినుము.

కర్మచేయు మార్గము, సన్యాస మార్గము, భయాభయములు రాగద్వేషములు, కర్తవ్య అకర్తవ్యములు, ముక్తి మార్గము గ్రహించగలుగు జ్ఞానుల బుద్ధిని సాత్త్విక బుద్ధి అందురు.

ధర్మాధర్మములు, కార్యాకార్యములు తెలియని నిత్య

శంకితుని బుద్ధిని రాజస బుద్ధి అనవచ్చు. అజ్ఞానముతో ధర్మమార్గం అనవసరమని దేనినైనా కుతర్కంతో ఆలోచించే బుద్ధిని తామస బుద్ధి అంటారు.

ఇదే విధంగా ధైర్యము గూడా త్రివిధములు.

మనసును, ప్రాణములను, ఇంద్రియ వ్యాపారములను యోగసాధనా బలిమిచే నిశ్చలంగా అరికట్టగల ధైర్యం సాత్త్విక ధైర్యమందురు. ధర్మార్థ కామములను సాధించవలెనని కోర్కెతో స్వాభిమానంతో ఫలాపేక్ష కోరుతూ మనిషి పొందే ధైర్యమే రాజస ధైర్యము. అవివేకి, అతి నిద్రాలోలుడు, భయము, దు:ఖము విషాదములతో సంశయాలతో ఏదో విధంగా పొందే ధైర్యము తామస ధైర్యము.

ఈ విధంగానే మనుషులకు కలిగే సుఖము కూడా త్రివిధములు. సాత్త్విక సుఖం మొదట్లో విష ప్రాయంగా కష్టంగా ఉంటుంది కానీ అంతమున అమృతంలాగా పరమానందమును కలిగిస్తుంది. అలాగే మొదట్లో చాలా



అమృతప్రాయంగా ఉండి చివరికి గరళంలా అప్రియమవుతుంది రాజసమైన సుఖం.

ఆది అంతమూ అంతా మోహకారకమై నిద్రాలోలునిచేసి బద్ధకం కలిగించే సుఖము తామస సుఖము.

ఓ అర్జునా ఈ రీతిగా ఈ త్రిగుణాలతో ముడిపడనిదేదీ ఈ ముల్లోకాలలోనూ దేవతలలోనూ కూడా లేదు. మరి నిమిత్త మాత్రులైన మానవులలో ఎంత? అందుచేతనే ఈ మానవులను వారి గుణములను బట్టి నేనే నాలుగు వర్ణముల వారిగా సృష్టించాను. వారే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. వారికి, వారి వారి కర్మ కాండలు కూడా నిర్దేశింపబడినవి. అవితెలుసుకో.

ఇక్కడ ఒక విన్నపం. ఈ 21వ శతాబ్దంలో ఇదంతా వ్యర్థంగా కనిపిస్తుంది. కానీ భగవద్గీతలో ఇది చెప్పినప్పుడు భగవానుని ఉద్దేశ్యం క్షత్రియుడైన అర్జునునికి వాని కర్తవ్యమేమిటో తనే నిశ్చయించాను, వాని ప్రమేయం లేదని చెప్పటమే.



శూద్రులను కించపరచారని అనుకోవటం తగదు. జాగ్రత్తగా చదివితే దీని అర్థం తెలుస్తుంది. బ్రాహ్మణులకు నిర్దేశించిన కర్మలేవి అనగా....

ఆత్మ నిగ్రహము, ఇంద్రియ నిగ్రహము, తపమాచరించుట, శుచి క్షమాగుణములుండుట, సత్ప్రవర్తనము, శాస్త్రజ్ఞానము వృద్ధి పరచుకొనుట, దాని జ్ఞాన సారమును తెలియచెప్పగలుగుట, దైవభక్తి. ఇవి కలవాడే బ్రాహ్మణుడు. అంటే కేవలం పుట్టుకవల్ల బ్రాహ్మణుడు కాదనే భగవానుడి భావం అని గ్రహించాలి. మనలో నిజమైన బ్రాహ్మణులు ఎంతమందో మనకే వదిలేశాడు పరమాత్మ.

క్షత్రియులకు నిర్దేశించిన కర్మలేవి అనగా.

శౌర్యగుణము, తేజము, ధైర్యము, యుద్ధనిపుణత, దక్షత కలిగి యుండుట, దానగుణము, పౌరుషము, యుక్తితో ప్రజాపాలన చేయుట (ప్రజా రక్షణ) ఇవి వాంచ విహిత కర్మలు.



వ్యవసాయము, వ్యాపారములయందు నిపుణత పశుపోషణాభారము ఇవి వైశ్యులకు నిర్దేశింపబడిన కర్మలు. శూద్రులకు వీరందరకూ సేవలందించుట వారికి నిర్దేశింపబడిన కర్మలు. ఇది భగవానుని నిర్దేశము అని భగవద్గీత చెపుతోంది. ఇందులో న్యూనత ఏమీలేదు. ఏపని చేయువారికైన తగిన మనుష్య సహాయము కావలెను. వైద్యులకు నర్సులు, ఇంజనీర్లకు అసిస్టెంటు ఇంజనీర్లు, వ్యాపారులకు సేల్స్‌మెన్, గుడిలోని పూజారికి గుడిని శుభ్రముచేయువారు మొదలయినవారు రాజులకు సైనికులు అవసరమేకదా. మరి వారి సహాయకులు అల్పులని భావమూ ఎంతమాత్రమూ కాదు. సేవలందించుటయన్న సహాయము చేయుట అంతేకానీ బానిసత్వము కాదు. ఎవరో అజ్ఞానులు అది తెలియక అహంకారమున శూద్రులను సేవకులుగా భావించి నిరాదరించి యుండవచ్చును. అట్టివారు సాత్త్వికులు కాదు. తామసులని పరమాత్మే చెప్పియున్నాడు. అందరిలోనూ నన్ను చూడాలని

అందరి ఆత్మ ఒక్కటే అందరిలోనూ నేనున్నానని ఆయనే చెప్పి యున్నాడు.

కాబట్టి శూద్రులను కించపరిచేది భగవద్గీత అను వారి వాదన సరికాదు. అయితే శూద్రులలోనే జాత్యహంకారము లేదని అనలేము కదా. ఇది మానవ జాడ్యము. కులగజ్జి అన్ని మానవ వర్ణములయందునూ ఉన్నదే. ఈ విషయమునింతతో వదిలి భగవానుడు చెప్పినట్లు కర్మల నాచరిస్తూ కూడా మానవుడు పరమపదమునేవిధంగా పొందగలడో తెలుసుకుందాం. సర్వ ప్రాణికోటి సృష్టి స్థితి లయలకు కారణమైన విశ్వ వ్యాపకుడు అయిన భగవానుడు విహితము గావించిన కర్మలను కర్మలనబడే పూజగా భావించి చేసినచో తప్పక పరమగతిని పొందగలడు, మానవుడు, ఇందు ఏమాత్రం సందేహములేదు.

**బాగుగా ఆచరించబడిన పరాయి ధర్మము కంటే, గుణవంతము కానిదైనా స్వధర్మమే మేలు అని గ్రహించి**



**స్వధర్మమే బాగుగా చేయువానికి పాపములంటవు. కర్మలవల్ల కొంత దోషము నెలకొన్నను ఆ కర్మలను వదలరాదు. నిప్పుమీద పొగయుండడం సహజం కదా, అంతమాత్రాన నిప్పునే విడనాడలేం కదా.**

**ఆత్మ నిగ్రహంతో ఫలాపేక్ష లేక కర్మలు చేస్తే తప్పక కర్మఫలమునకతీతమైన గతిని పొందవచ్చును. ఇట్టి నిష్కామ కర్మచే సిద్ధి పొందిన పిదప మనుష్యులు పరమాత్మనే రీతిగా పొందగలరో జ్ఞాన నిష్ఠ అనగా నేమియో వినుము చెప్తాను. నిష్కామ కర్మిష్ఠి, పరిశుద్ధాత్మతో ధైర్యంగా శబ్దాది భౌతిక విషయములందు శ్రద్ధవదిలి ఏకాంత ప్రియుడగు మిత భాషణము, మిత భోజనముతో మనోవాక్కాయముల నణచి, నిత్యము దైవధ్యానముతో వైరాగ్యము చెంది అహము, గర్వము బలమదములను వదలి భౌతిక ఇంద్రియ సుఖములను కాంక్షించక పరమశాంతి కలిగి యుంటే తప్పక పరబ్రహ్మ పదమునొందగలరు. అటువంటి వాడు నిరాసక్తుడు. దు:ఖాతీతుడు అన్ని జీవులయందు సమభావనగల దైవభక్తుడు.**



**అట్టి భక్తుడే నాయొక్క సచ్చిదానందమగు రూపమును, ఘనతను, తత్త్వమును ఎరుగును. నన్నాశ్రయించి యుండును. కర్మలన్నిటికీ తను నిమిత్త మాత్రుడని నేనే కారణభూతుడనని నమ్మి అక్షరుడనైన నన్ను ఆశ్రయించి నాదరి చేరును.**

**అందుచేత ఓ అర్జునా నీ కర్తవ్యమును తెలిసికొనుము అన్ని కర్మలనూ నాకర్పణ చేయుము. నీ హృదయాన నన్నే పతిగ, గతిగ నమ్మి ధ్యానయోగంతో నీమనసును నాపై లగ్నం చేయి నా అనుగ్రహంతో ఈ భవజలధి దాటగలవు. నిన్ను పాపములంటవు నిన్ను. అట్లు చేయలేనిచో నిశ్చయముగా భ్రష్టుడవయ్యేదవు. నీవు యుద్ధము మానినంతమాత్రమున నీ ఆలోచన నెరవేరదు. నీగుణమే నిన్ను ప్రేరేపించ నీ కర్మ ప్రభావంచే యుద్ధం చేస్తావు. ఇది తథ్యము. సర్వేశ్వరుడైన ఆ పరమాత్మ చేతిలో మానవులంతా కీలుబొమ్మలని, ఆయన ఆడించినట్లు ఆడటమే వారిపని అని గ్రహించు. అందుచేత పాప పరిహారమునకై ఈశ్వరునే శరణందుము. వానిదయచే**



**పరమశాంతిని పొంది ఐశ్వర్యవంతుడవయి శాశ్వతమగు మోక్షమొందగలవు. ఆఖరిసారి చెప్తున్నాను వినుము. కేవలం నీవు నా ప్రియ సఖుడవని, నీకు ఎంతో శ్రమకోర్చి ఈ జ్ఞానం బోధించి నీ కర్తవ్యం నీకు గుర్తు చేశాను. ఆపై నీ బుద్ధికి ఏదితోస్తే, అదిచెయ్యి. ఇంకొక మాట. నీమేలు కోరి శపథం చేసి మరీ చెపుతాను వినుము.**

**నామీద మనస్సు లగ్నం చేసి, నన్నే పూజించు నమస్కరించు. ధర్మాల గురించి ఆలోచించకు. నన్ను ఆశ్రయించు. నేనే నిన్ను పాపవిముక్తుణ్ణి చేస్తాను. భయపడకు. నీకు బోధించు ఈ గీతా సారస్వం అంతా నీవెన్నడూ తపము మీద ధ్యాసలేని దైవద్వేషికి చెప్పరాదు. నన్ను ద్వేషించి నన్ను నమ్మని పాపాత్మునకు దీనిగురించి ఏమాత్రము చెప్పరాదు. కేవలం నా భక్తులకు మాత్రమే దీనిని బోధించవలెను. అట్లు ఎవడు చేయునో వాడే నాకు ప్రీతిపాత్రుడు. మనుష్యులలో ఉత్తముడు, నన్ను చేరగల నా పరమ హితుడు. ఇది నిజము.**

**ఓ ధీరమతీ ఈ మన ధర్మ సంవాదమే భగవద్గీత అను పేరున ప్రసిద్ధి చెందును. దీనిని ఆలకించిన వారికి జ్ఞాన యజ్ఞ ఫలములు కలిగి నన్ను కొలుచు భాగ్యము కలుగును.**

**దీనిని ఎవడు శ్రద్ధాభక్తులతో, ఈర్ష్యాద్వేషములు లేక పఠించునో వానికి పాపముక్తి కలుగుట తథ్యము. ఆ భక్తుడు తప్పక పుణ్యలోకములు పొందగలడు. ఇప్పుడు చెప్పుము. ఓ అర్జునా! నీ సందేహములన్నీ తీరినవా? నీ అజ్ఞానము మోహము నశించినవా?**

అప్పుడు అర్జునుడిలా అన్నాడు. ఓ ప్రభూ నీ దయచేత నాకు బంధువ్యామోహము నశించింది. సందేహములన్నీ తొలగిపోయాయి. నీపాదసాక్షిగా చెబుతున్నాను. తప్పక యుద్ధం చేస్తాను. ఓ విజయసారధీ నేను నీకు దాసుడను నీచెప్పిన రీతి నేను నడుచుకుంటాను. నన్ను దయతో కాపాడు.

అప్పుడు సంజయుడు ధృతరాష్ట్ర మహారాజుతో



ఈవిధంగా అన్నాడు. ఓమహారాజా శ్రీకృష్ణపరమాత్మకు అర్జునునికీ జరిగిన ఈ సంవాదము, దాని సారమును చక్కగా విన్నాను. ఆశ్చర్యజనకమైన ఈ భగవద్గీత విని నాకు ఒడలు పులకరించుచున్నవి.

యోగేశ్వరుడైన దేవకీనందనుడు చెప్పిన యోగశాస్త్రమును వేదవ్యాసుని దయవల్ల విన్నాను. లేనిచో గోప్యమైన ఈ గీతను నేనెట్లు తెలియగలను. అద్భుతమైన ఆ విశ్వరూపమును నాబోటి అల్పుడెట్లు గాంచగలుగును. అయ్యా సంతోషముతో ఆ కృష్ణ దేవుని కృపతో నా జన్మధన్యమయింది. మరల మరల ఆ భగవద్గీతను ఆ విశ్వరూపమును స్మరణకి తెచ్చుకుంటున్నాను. వారిద్దరూ ఉన్నచోట విజయం సిరిసంపదలు తథ్యం సుమా.

ఓం భగవతే వాసుదేవాయ

ఈ విధంగా భగవద్గీత వినిపించబడి నాబోటి సామాన్యుడిని ధన్యుడిని చేయడానికి ఆ పరమాత్మే



ప్రోద్భలపరచి, సాయపడి దయతలచి తేటతెలుగులో మొదట పద్యంగానూ, తర్వాత గద్యంగానూ వ్రాయించాడు. ఆయనకి శతకోటి కృతజ్ఞతా పూర్వక నమస్కారములు. నా జీవితం ధన్యమయ్యింది. దీనివల్ల నాకు ఏమాత్రం పుణ్యం కలిగినా అదంతా ఆ శ్రీకృష్ణపరమాత్మకే అర్పణ చేస్తున్నాను.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

శ్రీకృష్ణార్పణమస్తు, శ్రీకృష్ణార్పణమస్తు

శ్రీకృష్ణార్పణమస్తు, శ్రీకృష్ణార్పణమస్తు

శ్లో॥ మంగళం విశ్వరూపాయ పార్థభీతి నివారకా

మంగళం శిష్టరక్షాయ వేదవేద్యాయ మంగళం



## స్మృతి

**రాచర్ల విశ్వనాథం మరియు వరలక్ష్మి గార్ల కుమారుడు**

**నా బావమరిది వెంకటేష్ స్మృతికి ముద్రింపబడినది.**

ఉ॥ పోయినవారు రారుకద పుణ్యము తీరిన దాక ఆ దివిన్
మాయగనుండి సంతసము, మన్ననలందుదురయ్య వెంకటేష్!
ఈయది నేర్చియున్ మృతికి నేడ్తురు, దీక్షితులంటి మూర్ఖులున్
నాయన! ఆత్మశాంతిగని నా మనసూరట నొంద జేయుమా.

– రచయిత

**Please Visit :**
**www.geetadeeksha.com**